తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త




## శ్రీహరికోట నుంచి త్వరలో అగ్నిబాణ్ ప్రయోగం




శ్రీహరికోట (తడ), జనవరి 13 ప్రభాతవార్త

శ్రీహరికోటలోని సతీష్‌థవన్ అంతరిక్ష కేంద్రంలో అగ్నికుల్ స్టార్టప్‌కు చెంది న అగ్నిబాణ్‌ను త్వరలోనే ప్రయోగిస్తున్నారు. తమిళనాడుకు చెందిన అగ్నికుల్ కాస్మోస్ వారి అగ్నిబాణ్ లోఎర్త్ ఆర్బిట్ (లియో)లో ప్రవేశపెట్టి అధ్యయయం చేయనుంది. ఇందుకు సంబంధించి అగ్నికుల్ వారికి షార్‌లో ఒక మినీ లాంచ్ ప్యాడ్ ఏర్పాటు చేసుకునేందుకు కూడా ఇస్రో అనుమతి ఇచ్చింది. అక్కడి నుంచి ప్రయోగ వేదికను అభివృద్ధి చేసుకొని అగ్ని బాణ్‌ను ప్రయోగిస్తున్నారు. ఈ మినీ రాకెట్ భూమికి తక్కువ దూరంలోని అంతరిక్ష కక్ష్యకు చేరేలా ప్రణా ళికలు రూపొం దిం చారు. అగ్నిబాణ్ ప్రయోగం తర్వాత ఇస్రో ఆధ్వర్యంలోఎ మరిన్ని ప్రైవేటు స్టార్టప్‌లకు చెందిన మినీ రాకెట్లు శ్రీహరికోట నుంచి ప్రయోగించే అవకాశం ఉంది. మార్చి నెలలోపే ఈ ప్రయోగం నిర్వహించేఅవకాశం ఉన్నట్లు ఇస్రో వర్గాలు వెల్లడించాయి.

## నారావారిపల్లికి నందమూరి వసుంధర, నారా దేవాన్ష్

### నేటి మధ్యాహ్నం చంద్రబాబు, సాయంత్రం లోకేష్ బ్రాహ్మణీ రాక



చంద్రగిరి, జనవరి 13 ప్రభాతవార్త:

సంక్రాంతి సంబరాలను జరుపుకునేందుకై నందమూరి బాలకృష్ణ సతీమణి నందమూరి వసుంధర తన మనవడు నారా దేవాన్ష్‌ను తీసు కుని శనివారం నారావారిపల్లికి చేరుకున్నారు. అదేవిధంగా ఆదివారం మధ్యాహ్నం మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదివారం మధ్యాహ్నం నారావారి పల్లికి చేరుకుంటారు. సాయంత్రం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, నారా బ్రాహ్మణీ దంపతులు నారావారిపల్లికి చేరుకుంటారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.

జనసేన

నీకా...?

నాకా...!?

తెలుగుదేశం పార్టీ

## చిత్తూరు టిక్కెట్ జనసేనకా..?-తెలుగుదేశంకా?

### 'దేశం' అధిష్టానం పరిశీలనలో నలుగురి పేర్లు

చిత్తూరు, జనవరి 13 ప్రభాతవార్త:

2024 అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తూరు నుండి తెలుగుదేశం తరపున ఎన్ని కల బరిలో నిలిచే అభ్యర్థి ఎవరనే విషయంపై ఇప్పటి వరకు స్పష్టత కన్పించని పరిస్థితి నెలకొంది. తెలుగుదేశం పార్టీ జనసేనపార్టీతో పొత్తు పెట్టుకోవడం, 20 19 అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఇప్పటి వరకు చిత్తూరు 'దేశం' నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌ని నియమించకపోవడం, 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తులో భాగంగా చిత్తూరు అసెంబ్లీ స్థానాన్ని ఇప్పటి వరకు జనసేనకు కేటాయిస్తారని విస్తృతంగా ప్రచారం జరిగింది. చిత్తూరు నుండి జనసేనఅభ్యర్థిగా డికెఆదికేశవులు తన`యుడుడిఎ్రీనివాస్ బరిలోవుంటారని ప్రచారంజరుగుతోంది. అయితే చిత్తూరు నుండి తెలుగదేశం అభ్యర్థిగా పోటీ చేయడానికి తమ పార్టీ అధిష్టానం నలుగురి పేర్లను పరిశీలిస్తోందని తెలుగుదేశం శ్రేణులు ప్రచారం చేస్తున్నాయి. చిత్తూరు అసెంబ్లీ స్థానం పరిధిలో బలిజ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు ఎక్కువగా వుండటం, ఇది వరకు ఇక్కడి నుండి బలిజ సామాజిక వర్గానికి చెందిన ఎఎస్. మనోహర్, డిఎ సత్యప్రభలు ఎమ్మెల్యేలుగా వుండటంతో ఈ సారి అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం అదే సామాజికవర్గానికి చెందిన వారిని అభ్యర్థిగా ఖరారు చేయనుందని ఆ సామాజిక వర్గానికి చెందిన నాయకులు భావిస్తున్నారు. ఇదే సమాజిక వర్గానికి చెందిన మాజీ మేయర్ కఠారి హేమలత, జిల్లా తెలుగుదేశం ఉపాధ్యక్షులు కాజూరు బాలాజీలు తెలుగుదేశం అభ్యర్థిత్వం కోసం ముమ్మ రంగా ప్రయత్నిస్తున్నారు. కాజూరు బాలాజీ గత మూడు సంవత్స రాలుగా పార్టీ కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొని ప్రజల్లోకి వెళ్ళడం, మాజీ మేయర్‌గా కఠారి హేమలత ప్రజల్లో వుండటం, ఆమె అత్తామామలు కఠారిఅనురాధ, కఠారి మోహన్‌లు ప్రజలకుసుపరిచతం కావడం, ప్రస్తుతం నగర పార్టీ అధ్యక్షురాలిగా వ్యవహరిస్తుండటంతో అభ్యర్థిత్వం తమకే వస్తుందని వీరిద్దరు ఆశిస్తున్నారు. ఇదే సామాజిక వర్గానికి చెందిన డిఎ శ్రీనివాస్ ఒకవేళ జనసేన పార్టీలో చేరకుండా తెలుగుదేశం తరపున పోటీకి సిద్ధమైతే పార్టీ అధిష్ఠానం ఆయనకు అభ్యర్థిత్వం కేటాయించడానికి సిద్ధంగా వుంది. అలాగే మరోవైపు రాష్ట్రంలో ఈ సారి ఎలాగైనా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందని భావిస్తున్న మరో సామాజిక వర్గానికి చెందిన నేతలు ఈ సారి ఎలాగైనా చిత్తూరు నుండి తమ సామాజిక వర్గానికి చెందిన వారు ఎమ్మెల్యేగా వుండాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

ఈ సామాజిక వర్గం నుండి మాజీ జడ్పీ ఛైర్మన్ గీర్వాణి భర్త మాజీ మార్కెట్‌కమిటీ ఛైర్మన్ చంద్రప్రకాష్‌తో పాటు గురజాల జగన్మో హన్‌నాయుడు అభ్యర్థిత్వం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో చిత్తూరు నియోజకవర్గ పరిధిలో బీసీలు అధికంగా వుండటంతో ఇక్కడి నుండి తనకు అభ్యర్థిత్వం కేటాయించాలని సిఆర్ రాజన్ పార్టీ అధిష్టానంను అభ్యర్థి స్తున్నారు. ఈ పరిస్థితుల్లో పార్టీ అధిష్టానం ఎవరికి అభ్యర్థిత్వం కేటాయిస్తుందనే విషయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

## బాధలను అగ్నికి ఆహుతి ఇచ్చేదే 'భోగిపండుగ'

-నేడు భోగి



తొట్టంబేడు, ప్రభాతవార్త

ప్రతి సంవత్సరం ఆంగ్లనెలల ప్రకారం జనవరినెలలోను, తెలుగునెలల ప్రకారం పుష్యమాసంలోను శ్రద్ధతో ఆచరించే పెద్దల పండుగగా పేరొందిన పెద్దపండగే మకరసంక్రాంతి. దక్షిణాయనానికి ఆఖరిరోజు, ధనుర్మాసానికి ఆఖరిరోజు, మకరసంక్రాంతికి ముందు రోజు భోగి పండుగ. సాధారణంగా భోగి అంటే తొలిరోజు అని అర్థం. పెద్దపండుగగా పిలువబడే మూడు రోజుల సంబరాలు సంక్రాంతికి తొలిరోజును భోగిగా పిలుస్తారు. దక్షిణాయనంలో ప్రజలు తాము పడిన కష్టాలను, భాదలను అగ్ని దేవుడికి ఆహుతి చేస్తు రాబోయే ఉత్తరాయణంలో సుఖసంతోషాలను ఇమ్మని కోరుతూ వేసే మంటలే 'భోగిమంటలు'. భోగి రోజు సాయంత్రం పిల్లలకు పోసే భోగి పళ్లు సాక్షాత్తు శ్రీమహావిష్ణువు ఆశీస్సులుగా పేర్కొంటారు. ఈపండుగనాడు సంక్రాంతి సంబరమంతా పిల్లలదే. తెల్లవారు జామునే లేని భోగిమంటలు వేయడం, సాయంత్రం భోగి పండ్లు పోయించుకోవడంతో హుషారుగా ఉంటారు. 'భగ' అన్న పదం నుంచి 'భోగి' అన్న మాట పుట్టిందని చెబుతారు. భగ అంటే మంటలు లేదా వేడిని పుట్టించడం అని అర్థం. రేగిపండ్లను సంస్కృతంలో 'బదరీఫలం' అంటారు. తమ పిల్లలకు భోగిపళ్లలో చేమంతి, బంతి పూలరేకులు, అక్షింతలు, చిల్లరనాణేలు, పాలకాయలు కలిపి చిన్నారుల తలపై పోస్తారు. సాధారణంగా భోగి అంటే సూర్యుణ్ణి అరాధించే అతిపెద్ద ఉత్సవం. సంక్రాంతి పండుగ వచ్చిందంటే తెలుగు లోగిళ్లన్నీ కళకళ లాడుతుంటాయి. కొత్తపంటలు ఇంటికి రావడం, అల్లుళ్లు కూతుళ్లు, మనుమలు. ఇలా ఇంటి నిండా ఆత్మీయులు, సన్నిహితులతో ఇళ్లు ఆనందోత్సాహాలతో నిండి ఉంటుంది.

## రాష్ట్రంలో అవినీతి రాజ్యమేలుతోంది

### సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



చంద్రబాబు నాయుడు పర్యటన ఏర్పాటును పరిశీలిస్తున్న టిడిపి పొలిటి బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ తదితరులు...

వెంకటగిరి, జనవరి 13, ప్రభాతవార్త

రాష్ట్రంలో అవినీతి రాజ్యమేలుతోందని టిడిపి రాష్ట్ర పొలిటి బ్యూరో సభ్య లు సోమిరెడ్డి తెలిపారు. ఈ నెల 19వ తేది టిడిపి జాతీయఅధ్యక్షులు నారాచంద్రబాబు నాయుడువెంకటగిరిలోబహిరంగ సభను నిర్వహించే ఏర్పాట్ల విషయమై నియోజకవర్గ ఇన్చార్జిలతో ఆయన వెంకటగిరిలోని మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ నివాసగృహంలో చర్చించారు. రాష్ట్రంలో ఇసుక మాఫియాలు ఎక్కువైనట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజలకు పార్టీలకు కేజిఎఫ్ సినామాను సిఎం జగన్మోహన్ రెడ్డి చూపిస్తున్నట్లు విమర్శించారు. వైసిపి పార్టీలోని వారు పార్టీ అధికారంలోకి రాదని గోడలు దూకి పరిగెడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ పరిపాలన పూర్తిగా విఫలమైందని విమర్శించారు. 19న జరిగే టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు రా కదలిరా భారీ బహిరంగ సభకు ఒకటిన్నర లక్షల మంది వస్తున్నట్లు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే కురు గొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ప్రజలకు విరక్తి కలిగినట్లు చెప్పారు. సమావేశంలో టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు మాధవ నాయుడు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, నెలల సుబ్రమణ్యం, పాశం సునీల్ కుమార్, హేమలత, శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్చార్జులు సుధీర్ రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి జన్ని రమణయ్య, మాజీ ఏఎంసి చైర్మన్లు రాజేశ్వర రావు, చెంచయ్య, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సంక్రాంతి సుఖసంతోషాలు నింపాలి

### ప్రజలకు ప్రముఖుల శుభాకాంక్షలు



తిరుమల, జనవరి 13ప్రభాతవార్తప్రతినిధి:

తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు ఆంధ్రప్రదేశ్ పుట్టినిల్లుఅని, భోగి, సంక్రాంతి, కనుమ పర్వదినాలు ప్రజలకు సుఖసంతోషాలు నింపాలని పలువురు ప్రముఖులు ఆకాంక్షించారు. టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, తిరుపతి నగరపాలక మేయర్ డాక్టర్ శిరీష, టిటిడి ఈఓ ఏవి ధర్మారెడ్డి, జిల్లా ఎస్‌పి పి.పరమేశ్వరరెడ్డి, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి తదితరులు తిరుపతి జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సుఖసంతోషాలు నింపాలని, ఏడుకొండల వేంకటేశ్వరస్వామి కరుణాకటాక్షాలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు.

## చిరుత దాడిలో రెండు లేగదూడలు మృతి



ఐరాల, జనవరి 13 ప్రభాతవార్త:

చిరుతపులి దాడిలో రెండు లేదదూడలు మృతి చెందిన సంఘటన మం డలంలోని ఈడిగపల్లె వద్ద శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. సంఘటనకు సంభందించి స్థానికుల కథనం మేరకు వివరాలిలావున్నాయి. మండలంలోని ఈడిగపల్లెకు చెందిన రెడ్డెప్ప చెంగనపల్లె గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలం వద్ద నున్న మామిడి తోటలో పశువులను కట్టివుంచుతారు. ఈనేపథ్యంలో ఆవులతో పాటు లేగదూడలను కూడా శుక్రవారం రాత్రి కట్టివుంచారు. శనివారం తెల్లవారుజామున చిరుతపులి దాడి చేసి ఆవులతో పాటు కట్టివుంచిన రెండు లేగదూడలను చంపేసింది. ఈవిషయాన్ని బాధిత రైతు గుర్తించి అటవీశాకాధికారులకు సమాచారం అందించారు. స్థానిక అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని చిరుత పులి పాదము ద్రలను పరిశీలించారు. అలాగే చిరుతదాదిలో మృతి చెందిన లేగదూడలను కూడా పరిశీలించారు. నగరి అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తున్నట్లు తెలియడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

## విశిష్టతలకు భోగి పండుగ తార్కాణం

### -తాతానగర్ యువత భోగిమంటలు




తిరుపతి, జనవరి 13ప్రభాతవార్త:

ఉత్తరాయణవృణ్యకాలం ప్రారంభానికి ముందు భోగిపండుగ ఎన్నో విశిష్టతలకు తార్కాణమని తాతానగర్ యువత అన్నారు. భోగి పండుగ సందర్భంగా తాతానగర్ కూడలిలో నేతలు దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, గుండాల గోపీనాధరెడ్డి, పొన్నాల జేజిరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, కామేష్‌బాబు, ప్రసాద్, గజేంద్ర నాయుడు, లక్ష్మి, శ్రీలత, కావ్య, ధనలక్ష్మి ఆధ్వర్యంలో భోగిమంటలు వేశారు. బకాసురుడి బారినుండి ప్రజలకు విముక్తికలిగించిన రోజని పేర్కొన్నారు.

## శనీశ్వరునికి షోడషాభిషేకాలు

## భక్తులకు సంబరాలు



శనీశ్వరునికి పూజలు జరిపి అలంకారాలు

శ్రీకాళహస్తి, జనవరి 13

ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు అలంకా రాలు నిర్వహించారు. ఆలయంలో ఒక్కొక్క దేవునికి ఒక్కొక్కరోజు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించటం ఆనవాయితిగా వస్తుంది. శ్రీకాళహస్తీ శ్వరాలయానికి వారాంతంలో భక్తుల రద్దీ పెరుగుతుంది. నాలుగైదు రోజు లుగా భక్తుల్లేక వెల వెల లాడిన ఆల యానికి భక్తుల కళ వచ్చింది. ఈ నేపథ్యంలో శనివారం ఆలయంలో విపరీతమైన రద్దీ ఏర్పడింది. ముఖ్యంగా శనీశ్వరాభిషేకాలకు భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. శనివారం ఉదయం నుంచి ఆలయంలో భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. కాలసర్పదోష నివారణ పూజలకు భక్తులు క్యూకట్టారు. ఉదయం నుంచి భక్తుల రద్దీ తో పాటు రాహుకాల సమయంలో శనీశ్వరాభిషేకాలకు కదలి వచ్చారు. సాధారణంగా ఏ ఆలయంలో కూడా శనీశ్వరునికి విగ్రహం లేదు. కానీ దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనీశ్వరునికి విగ్రహాన్ని ఏర్పాటు చేయటమే కాకుండా బంగారు, వెండి ఉరువులు తయారు చేయించారు. శనివారం నాడు ఇక్కడ రాహుకాల సమయంలో అభిషేకాలు జరిపించుకోవటానికి హాజరౌతున్నారు.

### ఎటు చూసినా భక్తుల రద్దీ . . .

తమిళనాడు, అటు కర్నాటకల నుంచి భక్తులు సునామిలా వచ్చారు. శనివారం ఉదయం నుంచి ఇసుకేస్తే రాలనంత రద్దీ ఏర్పడింది. తిరుమలేశుని దర్శనానికి వస్తున్న భక్తులు అక్కడ ఇబ్బందులు ఎదుర్కొనటంతో సమీపంలోని శైవక్షేత్రంలో వెలసిన వాయులింగేశ్వరుని దర్శించుకుంటే మంచిదని భక్తులు కదలి వచ్చారు. రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా చుట్టు పక్కల రాష్ట్రాలైన కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్రల నుంచి విశేష సంఖ్యలో భక్తులు కదలి వచ్చి హర హర మహాదేవుని దర్శించుకున్నారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ ఇన్స్పెక్టర్ హరియాదవ్, ఆలయాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వైకాపాలో ఆ మూడు సీట్ల పరిస్థితి ఏమిటీ!

### నారాయణస్వామి, రోజాలపై కన్పించని క్లారిటీ
### పలమనేరు స్థానంపై కూడా

చిత్తూరు, జనవరి 13 ప్రభాతవార్త:

చిత్తూరు జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు సంబంధించి నాలుగు అసెంబ్లీ స్థానాలకు 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎవరనే విష యంపై క్లారిటీ వచ్చిన మిగిలిన మూడు అసెంబ్లీ స్థానాల నుండి పోటీ చేసే అభ్యర్థులెవరనే విషయంపై ఇప్పటికీ స్పష్టత లేని పరిస్థితి నెలకొంది. వైకాపా పార్టీ అధిష్టానం పది రోజుల క్రితం చిత్తూరు జిల్లాలో చిత్తూరు, పూతలపట్టు అసెంబ్లీ స్థానాలు మినహాయించి మిగిలిన స్థానాల నుండి సిట్టింగ్ అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలుస్తారని లీకులు ఇచ్చింది. చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబులకు ఈ సారి ఎన్నికల్లో అభ్యర్థిత్వాలు కేటాయించడం లేదని వైకాపా అధిష్టానం స్పష్టం చేసింది. చిత్తూరు ఎమ్మెల్యే ఆరణిశ్రీనివాసులుకు రాజ్యసభ అభ్యర్థిత్వం ఖరారు చేయ డంతో ఇక్కడి నుండి కొత్త అభ్యర్థిగా ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ఎంసి విజయానందంరెడ్డి అభ్యర్థిత్వంను వైకాపా అధిష్టానం ఖరారు చేసింది. అలాగే పూతలపట్టు నుండి ఎమ్మెల్యే ఎంఎస్ బాబు నిష్క్రమించడంతో అతని స్థానంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్ అభ్యర్థిత్వం ఖరారు చేస్తూ పార్టీ అధిష్టానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది, జిడినెల్లూరు నుండి డిప్యూటీ సిఎం నారాయ ణస్వామి, నగరి నుండి మంత్రి ఆర్‌కె రోజా, పలమనేరు నుండి ఎమ్మెల్యే వెంకటేగౌడలు 2024 ఎన్నికల్లో మరోసారి పోటీ చేస్తారని వైకాపా అధిష్టానం లీకులు ఇవ్వడంతో ఈ మూడు నియోజకవర్గాల్లో ఒక్కసారిగా అలజడి రేగింది. జిడినెల్లూరు వైకాపా అభ్యర్థిత్వం డిప్యూటీ సిఎం నారాయణస్వామికి ఖరారు చేస్తారని ప్రచారం జరుగడంతో ఆయనపై మాజీ ఎంపీ జ్ఞానేంద్రరెడ్డి వర్గం, అసమ్మతి నాయకులు, కార్యకర్తలు ఒక్కసారిగా తిరుగుబాబు చేశారు. మరోసారి డిప్యూటీ సిఎం నారాయణస్వామికి వైకాపా అభ్యర్థిత్వం ఖరారు చేస్తే ఆయనకు ఓటమి తప్పదని స్పష్టం చేశారు. ఈ క్రమంలో పునరాలోచనలో పడిన పార్టీ అధిష్టానం డిప్యూటీ సిఎం నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మి పేరును తెర పైకి తీసుకువచ్చింది. ఈ మేరకు జిడి నెల్లూరు వైకాపా అభ్యర్థిత్వం కృపాలక్ష్మికి ఖరారు చేస్తున్నట్లు వైకాపా అధిష్టానం లీకులు సైతం ఇచ్చింది. అయితే వైకాపా అధిష్టానం విడుదల చేసిన మూడవ అభ్యర్థుల జాబితాలో జిడినెల్లూరు నుండి కృపాలక్ష్మి పేరు లేదు. అలాగే మరో మత్రి ఆర్‌కె రోజా నగరి నియోజకవర్గంలో అసమ్మతి ఎదుర్కొంటున్నారు. మంత్రి ఆర్‌కె రోజాకు సైతం పది రోజుల క్రితం అభ్యర్థిత్వం ఖరారు చేసినట్లు వార్తలు వచ్చాయి. ఈ మేరకు మూ డవ జాబితాలో పేరు వస్తుందని ఆశలు పెట్టుకొన్న మంత్రి రోజా మరోసారి చుక్కెదురైంది. పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ సైతం స్థానికంగా వైకాపా నాయకులు, కార్యకర్తలతో తీవ్ర అసమ్మతిని ఎదు ర్కొంటున్నారు. అయితే ఈయనకు సైతం ఈ సారి ఎన్నికల్లో పోటీ చేయడానికి వైకాపా అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని ప్రచారం జరిగినా వైకాపా అధిష్టానం విడుదల చేసిన మూడవ జాబితాలో ఎమ్మెల్యే వెంకటేగౌడ పేరు లేదు. ఇక్కడి నుండి పోటీ చేయడానికి ఇటీవల తెలుగుదేశం నుండి వైకాపాలో చేరిన సుభాష్ చంద్రబోష్‌తో పాటు పారిశ్రామికవేత్త భూమిరెడ్డి మోహన్‌రెడ్డిలు ప్రయత్నాలు చేస్తు న్నారు. ఇక పుంగనూరు నుండి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కుప్పం నుండి ఎమ్మెల్సీ భరత్‌ల పోటీ చేయనున్నారు. మిగిలిన మూడు సిట్టింగ్ స్థానాలపై పార్టీ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసు కొంటుందనే విషయంపై ఉత్కంఠతతో ఎదురుచూస్తున్నారు.

## తెలుగు సాంప్రదాయాలకు "వార్త" నిలువుటద్దం

తెలుగుదనం ఉట్టిపడేలా

ముగ్గుల పోటీలు

4లో



## రోడ్డు ప్రమాదంలో తల్లికుమారులు మృతి

### మరో కుమారుడికి తీవ్ర గాయాలు



చంద్రమ్మ, హేమంత్‌సాయిరెడ్డి ఫైల్‌ఫోటో

బంగారుపాళ్యం, జనవరి 13 ప్రభాతవార్త:

చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి కెజి సత్రం సమీపంలో శనివారం సాయంత్రం ద్విచక్రవాహనం లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తల్లికు మారుడు మృతి చెందగా మరో కుమారుడు తీవ్రంగా గాయపడి చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. జె.కొత్తూరుకు చెందిన కె.చంద్రశేఖ ర్‌రెడ్డి భార్య చంద్రమ్మ కుమారుడు హేమంత్‌సాయిరెడ్డి, మరో కుమారుడు భరత్‌కుమార్‌రెడ్డిలు ద్విచక్రవాహనంలో బంగారు పాళ్యంకు బయలుదేరారు. జాతీయ రహదారి కెజి సత్రం వద్ద రోడ్డు క్రాస్ చేస్తుండగా పలమనేరు నుండి చిత్తూరు వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో చంద్రమ్మ(40), కుమారుడు హేమసాయిరెడ్డి(11) తీవ్రంగా గాయపడి సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. ఈ ప్రమాదంలో గాయపడిన భరత్‌కుమార్‌రెడ్డిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంక్రాంతి పండుగకు కొత్త బట్టలు కొనుగోలు చేయడానికి బంగారుపాళ్యంకు వీరు ద్విచక్రవాహనంలో ప్రమాదంకు గురయ్యారు. మృతి చెందిన చంద్రమ్మ, కుమారుడు హేమంత్‌సాయిరెడ్డి మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఎఎస్‌ఐ వల్లప్ప కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈ ప్రమాదంలో మృతి చెందిన తల్లికుమారుల మృతదేహాలు నుజ్జునుజ్జయ్యాయి. ఒకే కుటుంబానికి చెందిన తల్లి కుమారుడు పండుగకు ముందు మృతి చెందడంతో గ్రామంలో విషాధ ఛాయలు అలము కొన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మృతుల బంధువులు, సన్నిహితుల కన్నీటి రోదనలు మిన్నంటాయి.

## ఐఆర్ఎం కళాశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

కుప్పం, జనవరి 13 ప్రభాతవార్త



స్థానిక ఐఆర్ఎం డిగ్రీ కళాశాలలో శనివారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గోపూజ నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు సంప్రదాయ వేషధారణతో వచ్చి అలరించారు. కళాశాల ఛైర్మన్ బిఎం దయానిధి మాట్లాడుతూ భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను యువత మరువరాదన్నారు. పండగలు స oస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అన్నారు. అనంతరం కళాశాలలో నిర్వహించిన మినీ ఫ్యాషన్‌లో విద్యార్థినులు ప్రతిభ చూపారు. సెకండియర్ బైపిసికి చెందిన కావ్య మిస్ ఐఆర్ఎంగా, బికామ్ ఫైనలియర్ విద్యార్థులు చిరంజీవి, విజయ్ కుమార్‌లు మిస్టర్ ఐఆర్ఎంగా ఎంపికయ్యారు. వీరికి ఛైర్మన్ దయానిధి బహుమతులు అందించారు. కార్యక్రమాల్లోఅకడమిక్‌డైరెక్టర్‌డా॥ మధుసూధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

## కుప్పం డిగ్రీ కాలేజ్‌లో ప్రాంగణ ఎంపికలు

కుప్పం, జనవరి 13 ప్రభాతవార్త



కుప్పం డిగ్రీ కాలేజ్‌లో శనివారం ప్రముఖ సంస్థలు నిర్వహించిన ప్రాంగణ ఎంపికలకు విశేష స్పందన లభించినట్లు కాలేజ్ ఛైర్‌పర్సన్ శాంత నాగరాజ్ తెలిపారు. టెక్ మహీంద్ర, టాటా, అశోక్ లేలాండ్, యూనియన్‌బ్యాంక్,టివిఎస్, డీప్‌వేర్ సొల్యూషన్స్, బాటా వంటి సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. ఈసందర భ్ంగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు ఆఫర్ లెటర్లు అందించారు. తమ కళాశాలలో చదివే విద్యార్థులకు వందశాతం ఉద్యోగాల కల్పనే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్, ప్రిన్సిపాల్ సుధారాణి, పిఐ సుమయ, అధ్యాపకులు పాల్గొన్నారు.

## యువత విద్యతో పాటు క్రీడలపై మక్కువ చూపాలి

– ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్

రామకుప్పం, జనవరి 13 ప్రభాతవార్త



యువత విద్యతో పాటు క్రీడలపై మక్కువ చూపాలని ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ సూచించారు. పంద్యాలమడుగులో ఎన్టీఆర్ స్మారక క్రికెట్ టోర్నీని ఆయన ప్రారంభించారు. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ మూడు రోజులపాటు ఈపోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, నేతలు మునసా వ్మి, ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, నందారెడ్డి, సత్యేంద్రశేఖర్, రామూర్తి, మహ్మద్ రఫీ, గంట్లగౌడు, రామక ృష్ణప్ప, కామరాజునాయక్, కృష్ణానాయక్, విశ్వనాథ్, వెంకటాచలం , మనోహర్ పాల్గొన్నారు.

## వైకాపా కార్యకర్తల కుటుంబాలకు ఎమ్మెల్సీచే ఆర్థికసాయం

రామకుప్పం, జనవరి 13 ప్రభాతవార్త

మండలంలోని విజలాపురం పంచాయతీ బాల ఓబనపల్లి, 89 పెద్దూరు గ్రామాలకు చెందిన వైకాపా కార్యకర్తలు మృతి చెందారు. దీంతో శనివారం చిత్తూరు ఎంపి రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్‌లు వారి కుటుంబాలకు పదివేల వంతున ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఎంపిపి సుబ్రమణ్యం, మండల కన్వీనర్ బాబురెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, నేతలు మురుగేష్, కేశవరెడ్డి, చెంగారెడ్డి పాల్గొన్నారు.

## చంద్రబాబుకు లక్ష మెజార్టీ సాధనకు కృషి చేయాలి

శాంతిపురం, జనవరి 13 ప్రభాతవార్త

వచ్చే ఎన్నికల్లో తెదేపా అధినేత చంద్రబాబునాయుడుకు లక్ష మెజార్టీ సాధనకు వన్నియకులక్షత్రియులు కృషి చేయాలని నేతలు చంద్రశేఖర్, సాంబశివం , రాజు, కాణిపాకం వెంకటేష్ పేర్కొన్నారు. శనివారం బోయనపల్లిలో జరిగిన వన్నియకుల క్షత్రియుల సమావేశంలో వారు మాట్లాడారు. వన్నియకుల క్షత్రియులకు తెదేపా అధినేత చంద్రబాబునాయుడు అండగా ఉంటారన్నారు.కులపెద్దలు, యువత అందరూ కలసికట్టుగా మెజార్టీ సాధనకు కృషి చేయాలని కోరారు.సమావేశంలో నియోజకవర్గ వన్నియకుల యువత అధ్యక్షుడు సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రామూర్తి, మండల యువత అధ్యక్షుడు మురుగేష్, ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్‌చే ఉచిత కంటి వైద్యశిబిరం

కుప్పంరూరల్, జనవరి 13 ప్రభాతవార్త

కుప్పం లయన్స్ క్లబ్ అధ్వర్యంలో స్థానిక పిఇఎస్ అర్బన్ సెంటర్‌లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంకు విశేష స్పందన లభించింది. 56మంది కంటి సమస్యలతో బాధపడుతున్న వారు శిబిరంకు హాజరయ్యారు. వీరికి పరీక్షలు నిర్వహించి 11మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో జోనల్ అధ్యక్షుడు డా॥ మహేష్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సతే ్యంద్రశేఖర్, డైరెక్టర్లు సోము, సెంధిల్, శివ, లెనిన్, డా॥ కృష్ణమూర్తి, సతీష్, గిరిధర్, వైద్యులు పాల్గొన్నారు.

## పుంగనూరులో చట్టం వర్తించదా!

చిత్తూరు, జనవరి 13 ప్రభాతవార్త:

పుంగనూరులో భారత రాజ్యాంగం, చట్టం వర్తించదా! అని జిల్లా సిపిఐ కార్యదర్శి నాగరాజు పోలీసులను ప్రశ్నించారు. పుంగనూరులో శుక్రవారం భారత చైతన్య యువజన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రయాదవ్ ధర్మ పోరాట సభ నిర్వహించడానికి ఆ పార్టీ కార్యకర్తలు సన్నాహాలు చేస్తుంటే పోలీసులు అడ్డుకోవడం సరియైనదికాదన్నారు. రాజ్యాంగం ప్రకారం సమా వేశాలు, సభలు నిర్వహించుకోవడానికి భావ ప్రకటన చెప్పుకోవడానికి పౌరు లందరికీ హక్కులు వున్నాయన్నారు. జిల్లాలో ఇలాంటిసంఘటనలు పునరా వృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## కమలాంజనేయస్వామి ఆకుపూజ

చౌడేపల్లి, జనవరి 13 ప్రభాతవార్త



స్థానిక బస్టాండు వద్దగల కమలాంజనేయస్వామికి ఆకుపూజ శాస్త్రోక్తంగా జరిగింది. ఉదయాన్నే ప్రధానార్చకుడు వశిష్టాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి విశేష అభిషేకం, ఆకుపూజగావించారు. విశేష సంఖ్యలో భక్తులు కమలాంజనేయస్వామిని దర్శించుకొన్నారు. అనంతరం స్వామివారి పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## పోటాపోటీగా కెపిఎల్ క్రికెట్ టోర్నమెంట్

రాజులూరు(చౌడేపల్లి), జనవరి 13 ప్రభాతవార్త




మండలంలోని ఎ.కొత్తకోట క్రాస్ వద్ద గల నారా యణరాజు మెమోరియల్ మైదానంలో క్షత్రియ ప్రీమియర్ లీగ్(కెపిఎల్)క్రికెట్ టోర్నమెంట్ పోటా పోటీగా జరుగుతోంది. నియోజకవర్గ స్థాయి క్షత్రి య యువకుల మధ్య జరుగుతున్న ఈ పోటీల్లో 11టీములు పాల్గొన్నాయి. రెండు రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంటులో శనివారం కొత్తవీరపల్లి, పాపిశెట్టిపల్లిలతోపాటు పందిళ్ళపల్లి, రాజులూరు టీములు సెమీ ఫైనల్‌కు చేరుకొన్నాయి. ఈ టీములు ఈనెల 14న తలబడనున్నాయని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు ఆకర్షనీయమైన బహుమతులుంటాయని పురుషోత్తంరాజు, నవీన్‌రాజు, సుకుమార్‌రాజు, శ్రీధర్‌రాజు(గిరి), రాకేష్‌రాజులు తెలిపారు.

## వరసిద్ధుని దర్శించుకున్న కర్నాటక హైకోర్టు జడ్జి

కాణిపాకం, జనవరి 13 ప్రభాతవార్త:



కర్నాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ వెంకటేష్ నాయక్ శనివారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామి వారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేష వస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట ఆలయసూపరెండెంట్‌వాసు,టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్, ప్రోటోకాల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 14 నుండి కాణిపాకంలో స్వచ్ఛతీర్థం

కాణిపాకం, జనవరి 13 ప్రభాతవార్త:

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలోఈనెల 14 నుండి 22 వరకు స్వచ్ఛతీర్థం ఆలయశుద్ధి సేవ కార్యక్రమంను పెద్దఎత్తున నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశులు తెలిపారు. ఈసందర్భంగా దేవస్థానంలోని ప్రధాన ఆలయం, అనుబంధ ఆలయాలు, నాలుగు మాడావీధులు, బస్టాండ్, లడ్డూపోటు, అన్నదాన వసతి గృహాలు, ఆలయ పరిసరాల్లో శుద్ధి,ఆలయ సేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటల న ఉండి సాయం త్రం 5 గంటల వరకు జరిగే ఈకార్యక్రమంలో ఆలయ ఉభయదారులు, పరిసర గ్రామస్థులు, మహిళా సంఘాలు, స్వచ్ఛంధ సేవకులు, యువకులు ఆసక్తి కలిగిన వారు ఎవరైనా పాల్గొన వచ్చునని తెలిపారు.

## జల్లికట్టు..కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

వి.కోట, జనవరి 13 ప్రభాతవార్త

మండలంలో సంక్రాంతి సందర్భంగా జల్లికట్టు, కోడిపందేలను ఎవరైనా నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ లింగప్ప హెచ్చరించారు. మండల స్థాయిలో ప్రత్యేక బృందాలతో నిఘా ఉంచామన్నారు. పండగ సందర్భంగా వరుస సెలవులు ఉన్న నేపథ్యంలో ఊర్లకు వెళ్లేవారు ముందుగా తమ వివరాలు పోలీస్‌స్టేషన్‌లో ఇవ్వాలని వీరి ఇళ్ల వద్ద ఎల్‌హెచ్ఎంఎస్ విధానం ఏర్పాటుచేసి నిఘా ఉంచుతామన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## పేద విద్యార్థులకు సాయమందిస్తాం

సదుం,జనవరి 13 ప్రభాతవార్త



సదుం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు సహాయం చేయడానికి తాము కృషి చేస్తామని ఆపాఠశాల 1997–98వ సంవత్సరపు 10వ తరగతి విద్యార్థులు అన్నారు. శనివారం పాఠశాల ఆవర ణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈసందర్భంగా విద్యార్థులు పాత గుర్తులను ఒకరితో ఒకరు పంచుకున్నారు.తరువాతవిద్యార్థులంతా ముంద స్తు సంక్రాంతి వేడుకలు జరుపుకున్నారు.సోమశేఖర్,లోకా, ఆది,మోహన్, రెడ్డికిషోర్,నరేష్,సుబ్బు,ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## రూ.4 లక్షల విలువైన కర్ణాటక మద్యం స్వాధీనం

చిత్తూరు, జనవరి 13 ప్రభాతవార్త:



చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అశోక్‌పురంలో శనివారం వన్‌టౌన్ పోలీసులు అక్రమంగా తరలిస్తున్న నాలుగు లక్షల రూపాయల విలువైన కర్నాటక మద్యంను స్వాధీనం చేసుకొన్నారు. డిఎస్పీ శ్రీనివాసమూర్తి వెల్లడించిన వివరాల మేరకు కర్నాటక అక్రమ మద్యంపై రాబడిన సమాచారం మేరకు వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ విశ్వనాథరెడ్డి, ఎస్ఐ మల్లికార్జున, సిబ్బందితో పాటు శనివారం అశోక్‌పురం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రం ప్రక్కవీధిలో గోస్పె ల్ చర్చి ఆవరణలో అనుమానస్పదంతో తిరుగుతున్న లోకేష్(23) వ్యక్తిని పట్టు కొని విచారించి అతని వాహనంను తనిఖీ చేయగా అందులో కర్నాటక రాష్ట్రంలో మాత్రమే విక్రయించే 1,700 సిల్వర్‌కప్ 90 ఎంఎల్ లిక్కర్ సాచెట్‌లు రెండు పెద్ద గోనె సంచుల్లో లభ్యమయ్యాయన్నారు. వీటి విలువ 2 లక్షల రూపాయలు వుంటుంది.పోలీసులు అరెస్టు చేసిన లోకేష్ చిత్తూరు నగరంలోని గూలిన్స్‌పేటకు చెందిన వ్యక్తి అని డిఎస్పీ శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. లోకేష్ ఇచ్చిన సమాచారం మేరకు ఈ కేసులో త్వరలో మరికొంతమందిని అరెస్టు చేయనున్నామని ఆయనవెల్లడించారు. వన్‌టౌన్ పోలీసు సిబ్బందిని డిఎస్పీ శ్రీనివాసమూర్తి అభినందించారు.

## పక్కాగా వైద్య సేవలు

యాదమరి, జనవరి 13 ప్రభాతవార్త:



గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఏర్పాటు చేసిన హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లతో పక్కా వైద్య సేవలు అందించాలని జాతీయ నాణ్యత ప్రమాణాల బృంద సభ్యులు డాక్టర్ అర్జిత్ బెనర్జీ, డాక్టర్ కిరణ్, జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి డాక్టర్ నిరంజన్‌రెడ్డిలు పేర్కొన్నారు. వరదరాజులపల్లిలోని హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌ను శని వారం జాతీయ నాణ్యత ప్రమాణాల బృంద సభ్యులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు ఇంటి వద్దనే నాణ్యమైన ప్రథమ వైద్య చికిత్సలను అందించడానికి హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో యాదమరి పిహెచ్‌సి వైద్య బృందం సభ్యులు పాల్గొన్నారు.

## ఓటు హక్కుపై గాలిపటాల ద్వారా అవగాహన

చిత్తూరు, జనవరి 13 ప్రభాతవార్త:



చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ ఓటు హక్కుపై వినూత్నంగా అవగాహన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సంక్రాంతి పండుగ పురస్కరించుకొని గాలి పటాలతో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమంను శనివారం మున్సిపల్ అధికారులు చేపట్టారు. ఓట్ ఈస్ రైట్, ఓట్ ఫర్ ష్యూర్, ఓటు వజ్రాయుధం అంటూ రాసిన నినాదాలతో కూడిన గాలిపటాలను ఎగురవేస్తూ మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమీషనర్ గోవర్ధన్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి స్విస్ కార్యక్రమాల్లో భాగంగా ఓటు హక్కు ఆవశ్యకతపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం, నరసింహులు, వార్డు పర్యావరణ, పారిశుధ్య కార్యదర్శులు, మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## కోటలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

కోట, జనవరి 13 ప్రభాతవార్త



కోటలో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా మండల బిజెపి అధ్యక్షుడు డాక్టర్ సారంగం రమేష్‌బాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి అందించాలన్న ఉద్దేశంతో కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్రానికి అందిస్తున్న ప్రతి పథకంలో కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యంఉందన్నారు.ఈకార్యక్రమంలోఎంపిపి దాసరి అంజమ్మ, ఎంపిడిఓ మారెళ్ల భవాని, మండల బిజెపి నాయకులు వాసు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

## కోటలో సంక్రాంతి సందడి

కోట, జనవరి 13 ప్రభాతవార్త



తెలుగింట పెద్దపండగ సంక్రాంతి సందర్భంగా విద్యాసంస్థలకు సెలవు కావ డంతో ఇప్పటికే పిల్లలు ఇళ్లకు చేరుకున్నారు. ఆ క్రమంలో నూతన వస్త్రాలు తదితర కొనుగోళ్లకు కుటుంబ సమేతంగా తరలి రావడంతో కోటలో సందడి నెలకొంది..

## ఊరెళుతున్నారా.. అయితే జాగ్రత్త

– ఎస్ఐ పి.నాగబాబు

కోట, జనవరి 13 ప్రభాతవార్త

సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఊళ్లకెళ్లే వారు జాగ్రత్తగా ఉండాలని కోట ఎస్ఐ పి.నాగబాబు చెప్పారు. శనివారం ఆయన కోటలో విలేకరులతో మాట్లాడుతూ ఊర్లకు వెళ్లే ప్రజలు ఎంతో అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఊర్లకు వెళ్లే వారు ముందుగా పోలీసుస్టేషన్‌లో సమాచారం ఇస్తే ఆ ఇంటి పరిసరాల్లో పోలీసులు నిఘా ఉంచుతారనిచెప్పారు.బస్సుల్లో ప్రయాణించే టప్పుడు విలువైన ఆభరణాలు ధరించకూడదన్నారు.

## లయన్స్ క్లబ్‌చే వరద బాధితులకు సామగ్రి పంపిణీ

సూళ్లూరుపేట, జనవరి 13 ప్రభాతవార్త



స్థానిక లయన్స్‌క్లబ్ ఆఫ్‌షార్ ఆధ్వర్యంలో శనివారం ఇటీవల సంభవించిన మిచౌంగ్ తుపాను బారిన పడిన బాధితులకు స్టీల్ ప్లేట్లు, ఇతర సామగ్రి, దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఆదిశేషారెడ్డి మాట్లాడుతూ సూళ్లూరుపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో వరదకు బాగా దెబ్బతిన్న ప్రాంతమైన వట్రపాలెంలోని బాధితులకు ఈ సాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఆర్డీఓ చంద్రముని, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వై.నాగేశ్వరరావు యాదవ్, మొదటి, రెండవ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు ఎం.గౌతమ్, గోపాలకృష్ణ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సహాయ సహకారాలతో స్థానిక లయన్స్ క్లబ్ ఆఫ్ సూళ్లూరుపేట, షార్ వారు ఈ సాయాన్ని 600 కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా లయన్స్ క్లబ్ వ్యవస్థా పకులు నెల్విన్‌జోన్స్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఆదిశేషారెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు జెట్టి, ట్రెజరర్ అప్పారావు, మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ బివి రవికుమార్, క్యాబినెట్ కార్యదర్శి రామ్‌రాజ్, రీజనల్ ఛైర్మన్ డివి శరత్‌బాబు, ఆంజనేయులు, జోనల్ ఛైర్మన్ మోహన్‌రాజ్, మున్సిపల్ కమిషనర్ నాగిశెట్టి నరేంద్రకుమార్, నెల్లూరు క్లబ్, పినాకిని క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు

తడ, జనవరి 13 ప్రభాతవార్త

తడ మండలం గ్రద్దగుంట సెంటరు వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంపై శనివారం పోలీసులకు ఫిర్యాదు అందింది. గ్రద్దగుంట బీసీ కాలనీకి చెందిన జువ్వలపాటి నందయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు, ఆయన కుమారుడు నవీన్ గేదెలు మేపేందుకు వెళ్లి గత నెల 31న సాయంత్రం జాతీయ రహదారిపై నడుచుకుంటూ వస్తుండగా నెల్లూరు నుంచి చెన్నై వైపు వెళుతున్న కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నవీన్‌నుమొదటసూళ్లూరుపేట,అనంతరం తిరుపతి స్విమ్స్ ఆసు పత్రికి తరలించి పరిస్థితి విషమించడంతో చెన్నైకి తీసుకెళ్లినట్లు బాధితుడు పేర్కొన్నారు. ఈ మేరకు తడ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలు

– మద్యం బాటిళ్ల తనిఖీలు

తడ, జనవరి 13 ప్రభాతవార్త

ఆంధ్రా,తమిళనాడు సరిహద్దుల్లోని తడ మండలం భీములవారిపాలెం ఎన్ని కల తనిఖీ కేంద్రంలో పోలీసులు రెండు వేర్వేరు ఘటనల్లో మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దొరవారిసత్రం ఎస్ఐ జె. తిరుమలరావు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేస్తుండగా ఒక ఘటనలో చిట్టమూరు మండలం చిల్ల మూరు గ్రామానికి చెందిన అరిగల సుబ్బయ్య వద్ద 47 బాటిళ్లను, మరో సంఘటనలో అదే గ్రామానికి చెందిన బండిరమేష్‌వద్ద45బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు తడ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## ఘనంగా వివేకానంద ఛారిటబుల్ ట్రస్ట్ వార్షికోత్సవ వేడుకలు

మల్లాం (చిట్టమూరు), జనవరి 13 ప్రభాతవార్త



వివేకానంద ఛారిటబుల్ ట్రస్టు 12వ వార్షికోత్సవ వేడుకలు ట్రస్టు అధ్యక్షులు రహంతుల్లా ఆధ్వర్యంలో శనివారం మల్లాం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 12 మంది విద్యార్థులకు విద్య అవసరాలు నిమిత్తం ఒక్కొక్కరికి రూ.5 వేలు ఇవ్వడంతో పాటు 200 మంది పేదలకు సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించి చీరలు పంపిణీ చేశారు.ముఖ్య అతిథిగా వాకాడు సిఐ హరికృష్ణ, జిల్లా రైతు సంఘం నాయకులు దువ్వూరు శేషరెడ్డి, టిఎంఆర్ గ్రూప్ ఆఫ్ అధినేత మనో హర్‌రెడ్డితదితరులు విచ్చేశారు.సభలో ఎస్ఐగోపి,సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్ చిల్లకూరు సాయిరెడ్డి, దాతలు కాపులు శ్రీనివాసులు, పురుషోత్తం, దర్శి విక్రమ్, మురుగేష్, ఆశా శీనయ్య, వినోద్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాగరాజుపాల్గొన్నారు.

## చిల్లమూరులో వికసిత్ భారత్ సంకల్పయాత్ర

చిట్టమూరు, జనవరి 13 ప్రభాతవార్త



చిట్టమూరు మండల పరిధిలోని చిల్లమూరు, రామాపురం గ్రామాల్లో శని వారం కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి నోడల్ అధికారిగా ఇఓపిఆర్‌డి మనోహర్‌గౌడ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 17 పథకాలకు సంబంధించి ఇఓపిఆర్‌డి గ్రామస్థులకువివరించారు. ఈ కార్యక్ర మానికి బిజెపి మండల అధ్యక్షులు దువ్వూరు శరత్‌చంద్రారెడ్డితో పాటు వెంకట సుబ్బారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సుంకర రమణయ్య, సుంకర అల్లెయ్య, వెంకటేశ్వర్లు, భానువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

– ఓజిలి ఎస్ఐ డి.ఆదిలక్ష్మి



ఓజిలి, జనవరి 13 ప్రభాతవార్త

సంక్రాంతినిపురస్కరించుకొని కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఓజిలి ఎస్ఐ దారం ఆదిలక్ష్మి హెచ్చరించారు. ఆమె మాట్లాడుతూ సంక్రాంతి పండుగ వేడుకలను సంప్రదాయబద్ధంగా జరుపుకో వాలన్నారు. కోడిపందేలు, ఇతర జూదం నిర్వహించకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. సంక్రాంతి సంబ రా ల్లో యువతక్రికెట్,కబడ్డీ, వాలీబాల్, షటిల్, బాల్ బ్యాడ్మింటన్ వంటి క్రీడలు నిర్వహించుకోవచ్చని తెలిపారు.

## కుటుంబ సలహాలతో ఒకరు ఆత్మహత్య

దొరవారిసత్రం, జనవరి 13 ప్రభాతవార్త



దొరవారిసత్రం మండలం ఆనేపూడి గ్రామానికిచెందిన ఒలిపి జనార్ధన్ (38) అనే వ్యక్తి కుటుంబ కలహాలతో శనివారంఆత్మహత్య చేసుకున్నాడు. గత కొంత కాలం నుంచి కుటుంబ కలహాలతో తరచూ గొడవలు పడుతున్న క్రమంలో గ్రామ సమీపంలో ఉన్న బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గుర్తించి బయటకు తీసేటప్పటికే మృతిచెందాడు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వా సుపత్రికి పంచనామా నిమిత్తం తరలించారు.

## భోగిమంటలో ఎస్మా జివో కాపీలు

వెంకటగిరి, జనవరి 13, ప్రభాతవార్త

ఎస్మ జీవో కాపీలను అంగన్‌వాడి సిబ్బంది భోగి మంటలు వేసి దగ్ధం చేసి నిరసన తెలిపారు. అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శనివారం నాటికి 33వ రోజుకు చేరింది. శిబిరం వద్ద బోగి మంటలు వేసి ఆ మంటల్లో ఎస్మా చట్టం జీవో కాపీలను అంగన్‌వాడిలు, సిఐటియు ఆధ్వర్యంలో తగలబెట్టడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు తిరుపతి జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య, ఏపి అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు అధ్యక్షులు ఏ మంజుల కార్యదర్శి స్వరూప రాణి, వెంకటగిరి మండల అధ్యక్షులు సుభాషిని మాట్లాడుతూ అంగన్‌వాడీలు సమ్మె 33 రోజుల నుండి జరుగుతూ ఉంటే ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని అన్నారు.

## గూడూరు ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

– మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, జనవరి 13 ప్రభాతవార్త

గూడూరు నియోజకవర్గ ప్రజలకు మాజీఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పాత నిర్బంధపు చీకట్లను రూపు మాపే కొత్త కాంతులు ఇంటింటా వెల్లివిరియాలని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రమంతటా పాటు అభివృద్ధి విరజిమ్మాలని కోరారు. భోగ భాగ్యాలను అందించే భోగి, కొత్తకాంతులు తెచ్చే సంక్రాంతి, కనుమ పండుగలు అందరూ ఆనందంగా జరుపుకోవాలని కోరారు.

## కనుమూరు హరిశ్చంద్రారెడ్డి సేవలు స్ఫూర్తిదాయకం

– ఎమ్మెల్యే వరప్రసాదరావు



గూడూరు, జనవరి 13 ప్రభాతవార్త

కనుమూరు హరిశ్చంద్రారెడ్డి సేవలు స్ఫూర్తిదాయకమని గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. శనివారం గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో కనుమూరు హరిశ్చంద్రారెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అల్లూరు ఆదివేషారెడ్డి స్మారక మాస్టర్ క్రికెట్ లీగ్–2024 పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సుకు ముఖ్యఅతిథిగాఎమ్మెల్యే, డిఎస్పీ విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడా, సేవా, ఆధ్యాత్మిక, సాంస్కృతిక రంగాల్లో కనుమూరు హరిశ్చంద్రారెడ్డినిస్వార్థ సేవలందిస్తున్నారని కొనియాడారు. డీఎస్పీ రాజగో పాల్‌రెడ్డి మాట్లాడుతూ హరిశ్చంద్రారెడ్డి ట్రస్ట్ ఏర్పాటు చేసి గ్రామీణ క్రీడాకారులను ప్రోత్స హించడం హర్షణీయమన్నారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు కనుమూరు హరిశ్చంద్రారెడ్డి మాట్లాడుతూ ఇద్దరు స్నేహితుల ఆలోచనతో ప్రారంభమైన మాస్టర్ లీగ్ పోటీలు గత పదహారేళ్లుగా ట్రస్ట్ తరపున నిర్వహి స్తున్నామని తెలిపారు.ఈకార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, టి.నాగేశ్వ రరావు, ఆరు జట్ల కెప్టెన్లు, వెటరన్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిపక్షాల వారి మాయమాటలకు మోసపోవద్దు..

వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి

వెంకటగిరి, జనవరి 13, ప్రభాతవార్త



ప్రతిపక్షాల వారి మాటలు నమ్మి మోసపోవద్దని వైసిపి తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. వెంకటగిరి పట్టణం 8వ వార్డు పెరియవరం,మరాటిపల్లిలలో ఆయన మేలుకొలుపు కార్యక్రమాన్ని నిర్వ హించారు. అంగన్‌వాడి సిబ్బంది కూడా ప్రతిపక్షాల వారి హామీలకు, మోసం మాటలు చెప్పి వారిని ఇబ్బంది పెడుతున్నట్లు తెలిపారు. అంగన్‌వాడి సిబ్బంది డిమాండ్లను పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇస్తుంటే ప్రతిపక్షాల వారు వారిని తప్పు దోవ పట్టిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ బాలయ్య, వైసిపి జిల్లా కార్యదర్శి చిట్టే హరికృష్ణ, కౌన్సి లర్లు కృష్ణమూర్తి, ధనియాలరాధ,ఆరిశంకరయ్య,గోపాలకృష్ణ, సుబ్బారావు, నారాయణ, కళ్యాణి, పూజారి లక్ష్మీ, వాయిదా, కళ్యాణి, నాయకులు, మురళీకృష్ణ, లక్కమనేని కోటేశ్వర రావు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై ధ్వజమెత్తిన ప్రజా ప్రతినిధులు

వాకాడు,జనవరి 13 ప్రభాతవార్త



ప్రజా సమస్యలపై పాలక వర్గం సమస్యలను పట్టించుకోవడం లేదని ప్రజా ప్రతినిధులు ధ్వజమెత్తారు. శనివారం స్దానిక మండల పరషత్ కార్యలయాంలో ఎంపిపి అనుసూయమ్మ అధ్యక్షతన స్వర సభ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కల్లూరు సర్పంచ్ దువ్వూరు విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ అధికారులు సమావేశాలకు రావడం లేదని ఏ సమస్యల కూడా పరిష్కరించడం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయంలో గ్రామ సర్వేయర్లు అందుబాటులో ఉండటం లేదని ఆరోపించారు. వాకాడు సొసైటి ఛైర్మెన్ కొడలూరు దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఎల్లప్పుడు పాలక వర్గం ముందుంటుందని పేర్కొన్నారు. వైకాపా సర్కార్ ప్రజా సంక్షేమ పట్ల చిత్త శుద్దితో వ్యహరిస్తుందన్నారు.ఈ సమావేశంలో వ్యవసాయ సలహా మండల అధ్యక్షులు దువ్వూరు అజత్ కుమార్ రెడ్డి, సర్పంచులు మధుసూదన్ రెడ్డి, శంకరయ్య, పుల్లమ్మ, ఛైర్మెపర్సన్,నాగభూషణమ్మ, మహేంద్ర, కిరణ్ కుమార్, వైద్యధికారి, రామకృష్ణ,ఎంఇఒ నాసిం, ఏఈ కిరణ్ వెంకటేశ్వర్లు, ఏవో దీప, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మహిళ హత్య కేసులో నిందితులు అరెస్ట్

### పథకం ప్రకారం అన్నదమ్ములిద్దరూ కలిసి హత్య

**పుత్తూరు, జనవరి 13 ప్రభాతవార్త :**



పట్టణంలోని కల్యాణపురంలో ఈ నెల 22వ తేదీన జరిగిన ఒక మహిళ హత్య కేసులో నిందితులను ఈ నెల 12వ తేదీన పోలీసులు అరెస్ట్ చేశారు. తీసుకున్న అప్పు చెల్లించమని బంధువుల మధ్య గట్టిగా అడిగిన శ్రీదేవిని (49) అందరి మధ్య తమ పరువు పోయిందనే కోపంతో కక్ష పెంచుకున్న ఇద్దరు అన్నదమ్ములు కలిసి ఈ హత్యకు పాల్పడ్డారు. నిందితులైన ఇద్దరు అన్నదమ్ములు బి.చిరంజీవి (31), బి.లోకేష్ ()లను శనివారం అరెస్టు చేశారు. ఆ మేరకు శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పుత్తూరు డిఎస్పీ శ్రీనివాసరావు, సిఐ లక్ష్మీనారాయణ తెలిపిన మేరకు వివరాలిలా వున్నాయి. పుత్తూరు మునిసిపాలిటీ పరిధిలోని కల్యాణపురంలో గోపి, శ్రీదేవి దంపతులు నివశిస్తున్నారు. గోపి తిరుమలలో వ్యాపారం చేస్తున్నారు. వీరి కుమారుడు సాయికృష్ణ బెంగళూరులో సాఫ్ట్ వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. కుమార్తె ప్రియాంకకు వివాహమవగా ఆమె భర్తతో చెన్నైలో నివశిస్తోంది. గోపి తమ్ముడు వాసు తన కుమార్తె ప్రియదర్శినిని చిరంజీవికి ఇచ్చి వివాహం చేశాడు. చిరంజీవి తన భార్య ప్రియదర్శినితో తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి తాలూకాలో కొండాపురం గ్రామంలో మసూది వీధిలో నివశిస్తున్నారు. ఈ నేపథ్యంలో వీరికి భూమి కొనేందుకు డబ్బులు అవసరమవగా తనకు పిల్లనిచ్చిన మామకు అన్న అయిన గోపి ఇంటికి వచ్చి వారి నుంచి 3 లక్షలు ఒకసారి, 2 లక్షలు మరొకసారి మొత్తం అయిదు లక్షలు వడ్డీకి అప్పు తీసుకున్నారు. ప్రతి నెల వడ్డీ కూడా కడుతున్నారు. గతేడాది అక్టోబరు నుంచి వడ్డీ కట్టలేకపోయారు. వడ్డీ కోసం గోపి భార్య శ్రీదేవి వీరికి ఫోన్ చేసి గట్టిగా అడిగేది. ఇదిలా వుండగా గతేడాది డిసెంబరు 14వ తేదీన చిరంజీవి మామ అయిన వాసు ఇంటికి కుంభాభిషేకం కార్యక్రమం నిమిత్తం గోపి దంపతులు తమ కుమార్తె ప్రియాంకతో సహ వెళ్లారు. అక్కడ బంధువులు అందరి మధ్య చిరంజీవి కుటుంబాన్ని గోపి దంపతులు తమ అప్పు విషయమై నిలదీశారు. ఆ సందర్భంగా శ్రీదేవి మీరు దొంగలు, కడుపు అన్నం తింటారా, ఇంకేమి తింటారు అంటూ చిరంజీవిని ఆయన తమ్ముడు లోకేష్‌లను దుర్భాషలాడింది. దాంతో అన్నదమ్ములిద్దరూ తమను అవమానించిన శ్రీదేవిని చంపాలని నిర్ణయించుకున్నారు. పుత్తూరు టౌన్‌లో శ్రీదేవి ఒంటరిగా వుంటుందనే విషయం తెలిసిన నిందితులు ఎవరికీ తెలియకుండా వెళ్లి, ఎవరూ లేనపుడు చంపేద్దామని అనుకున్నారు. గతంలో చిరంజీవి అప్పు కోసం శ్రీదేవి ఇంటికి రావడం వల్ల అతనికి ఇంటి అడ్రస్ తెలుసు. ఈ మేరకు గతేడాది డిసెంబరు 20వ తేదీన చిరంజీవి అత్త శ్రీదేవికి ఫోన్ చేసి డబ్బు విషయమై మాట్లాడాలి ఎక్కడున్నావని అడిగాడు. తాను చెన్నైలోని ఆవడిలో కూతురు ప్రియాంక ఇంట్లో వున్నానని, మరుసటి రోజు అంటే 21వ తేదీ పుత్తూరు వస్తానని శ్రీదేవి చెప్పింది. దాంతో డిసెంబరు 22వ తేదీన ఆమెను చంపేద్దామని నిర్ణయించుకుని ముందుగా వేసుకున్న ప్లాన్ ప్రకారం చిరంజీవి కొండాపురంలోని తన ఇంటి నుంచి 22వ తేదీ ఉదయం 6.30 గంటలకు మోటరుసైకిల్‌లో బయలుదేరి శోలింగర్‌లోని తన అన్న లోకేష్ ఇంటికి చేరుకున్నాడు. అక్కడ తన బైక్‌ను మెకానిక్ షెడ్‌లో వదిలేశాడు. అన్న లోకేష్ తన ఫోన్‌ను ఇంట్లోనే విడిచిపెట్టాడు. లోకేష్ ఇంట్లో వున్న ఐరన్ రాడ్ తీసుకున్నారు. తర్వాత లోకేష్ తన పాసన్ ప్రో మోటారు సైకిల్ ( టిఎన్ 20 సియు 2400)ట్యాంక్ కవర్‌లో ఐరన్ రాడ్‌ను పెట్టుకున్నాడు. చిరంజీవి మోటారుసైకిల్ నడపగా లోకేష్ వెనుక కూర్చుని శోలింగర్ నుంచి ఉదయం 7.00 గంటలకు బయలుదేరారు. అత్తిమంజేరిపేట వద్ద చిరంజీవి తన మొబైల్ ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేశాడు. పల్లిపట్టు, కార్వేటినగరం మీదుగా పుత్తూరులోని శ్రీదేవి ఇంటికి వద్దకు ఉదయం సుమారు 9.00 నుంచి 10.00 మధ్య చేరుకున్నారు. కల్యాణపురంలోని మూడంతస్తుల ఇంట్లో రెండో అంతస్తులో వున్న రెండు పోర్షన్‌లలో ఒక పోర్షన్‌లో శ్రీదేవి దంపతులు నివశిస్తున్నారు. ఇంట్లో శ్రీదేవి ఒంటరిగా వుందని నిర్ణయించుకుని అన్నదమ్ములిద్దరూ మోటారుసైకిల్‌ను ఇంటి బయట వుంచి రెండో అంతస్తుకు వెళ్లారు. శ్రీదేవి వాళ్ల ఇంటికి మెయిన్ డోర్ వద్ద ఐరన్ గ్రిల్ గేట్ లోపల నుంచి తాళం వేసి వుంది. చిరంజీవి కాలింగ్ బెల్ నొక్కగా శ్రీదేవి వచ్చి తాళం తీసి లోపలికి పిలిచి కూర్చోబెట్టి కాఫీ ఇచ్చింది. అపుడు చిరంజీవి తనకు ఇంకా 3 లక్షలు అప్పు కావాలని అడిగాడు. ముందు ఇచ్చిన 5 లక్షల డబ్బు, వడ్డీ ఇవ్వాలని శ్రీదేవి అడిగింది. తీసుకున్న డబ్బు ఇవ్వకుండా మళ్లీ డబ్బు అడగడానికి సిగ్గు లేదా అని తిట్టింది. ప్రస్తుతం తమ వద్ద డబ్బులు లేవని, తమకు వచ్చిన వెంటనే ఇచ్చేస్తామని అన్నదమ్ములు చెప్పినా వినకుండా శ్రీదేవి ఇంకా తిట్టింది. దాంతో లోకేష్ లేచి బయటకు వెళ్లి దాచిపెట్టిన ఐరన్ రాడ్‌ను తీసుకుని వచ్చి శ్రీదేవికి తెలియకుండా ఆమె వెనుక నిలుచున్నాడు. చిరంజీవి ముందు నుంచి మాట్లాడుతుండగా వెనుక నుంచి లోకేష్ ఐరన్ రాడ్‌తో ఆమె తలపై బలంగా కొట్టాడు. తీవ్ర రక్త గాయాలవడంతో శ్రీదేవి అక్కడికక్కడే మృతి చెందింది. తర్వాత అక్కడ నుంచి తిరిగి వెళుతూ పద్మసరస్సు వద్ద హత్యకు ఉపయోగించిన ఐరన్ రాడ్‌ను ముళ్లపొదల్లో పారేసి శోలింగర్ వెళ్లిపోయారు. అన్నదమ్ముల్లో తమ్ముడు చిరంజీవి నెట్టూరు టెక్నికల్ ట్రైనింగ్ ఫౌండేషన్‌లో మెషీన్ టూల్ మెయింటెనెన్స్ కోర్సు పూర్తి చేసి 2013 నుంచి శోలింగర్‌లో వున్న టివిఎస్ ఫౌండరీ డివిజన్‌లో మెయింటెనెన్స్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. అన్న లోకేష్ కూడా ఇదే కంపెనీలో పనిచేస్తున్నాడు.

# ఏపి రాష్ట్ర సోషల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా సురేష్



**శ్రీకాళహస్తి, జనవరి 13 ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ సోషల్‌ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కూనాటి సురేష్‌ను ఎన్నికయ్యారు. రాష్ట్రంలోని సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల భోదనా విధానాలలో మెలకువలు నేర్పడానికి, పాఠ్యప్రణాళికల తయారీలో సహాయపడడానికి, పాఠ్యబోధనకు అవసరమైన బోధనోపకరణాల తయారీకి, విద్యలో నాణ్యత, శిక్షణ కార్యక్రమాలు, కరదీపికల తయారీ మొదలైన అలంశాల్లో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయు లకు సహాయపడడానికి రాష్ట్ర స్థాయిలో సోషల్‌ఫోరంను 2019లో ఏర్పాటు చేశారు. ఈఏడాది జరిగే ఎన్నికల్లో 26 జిల్లాలకు చెందిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇందులో ఏకగ్రీవంగా తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన కూనాటి సురేష్‌ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. దీనిని ప్రస్తుత అధ్యక్షులు తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కెయస్వీ కృష్ణారెడ్డి ప్రకటించారు. ఈసందర్భంగా ఆయనను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. ఈపదవిలో సురేష్ రెండేళ్ళపాటు కొనసాగనున్నారు.సాంఘికశాస్త్రఉపాధ్యాయులకుఅవసరమైనవృత్తిపరమైన నైపుణ్యాల సాధనకు సాంఘిక శాస్త్ర డిజిటల్ విద్యావ్యాప్తికి విద్యార్థి కేంద్రీకృత కృత్యాల తయారీకి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

# వ్యక్తిగత అభివృద్దే సమాజం, దేశాభివృద్ధి

### ఎడిపై పాఠశాల డైరెక్టర్ ప్రణీత్ ఎడిపై పాఠశాల వార్షికోత్సవం ప్రముఖులతో సందడి

**తిరుచానూరు, జనవరి 13, ప్రభాతవార్త**



వ్యక్తిగత అభివృద్దే సమాజ అభివృద్ధి దేశాభివృద్ది అని ఎడిపై పాఠశాల డైరెక్టర్ ప్రణీత్ విద్యార్థులకు సూచించారు. ఎడిపై పాఠశాల వార్షికోత్సవం గురువారం, శుక్రవారం రెండు రోజులు ఘనంగా నిర్వహించారు. పాఠశాల వార్షికోత్సవానికి వివిధ రంగాల ప్రముఖులు హాజరై తమ విలువై సందేశాన్ని విద్యార్థులకు అందించారు. ఇందులో భాగంగా చాణిక్య ఫోరమ్ ఎడిటర్ ఇన్‌చీఫ్, రిటైర్ ఇండియన్ ఆర్మీ వెటరన్, రిటైర్ డిఫెన్స్ అనెలిస్ట్, భారతదేశంలోనే ప్రముఖ టెలివిజన్ వాఖ్యాత, పబ్లిక్ స్పికర్ అయినటువంటి మేజర్ గౌరవ్ ఆర్యా మాట్లాడుతూ తిరుపతి ఎడిపై పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు పచ్చదనంతో నిండిన ఆహ్లాదకరమైన వాతావరణం, విశాలమైన క్రీడా మైదానం, ఉన్నతమైన విద్యతో పాటు నైతిక విలువలు కూడా నేర్పొస్తున్నారని కొనియాడారు. మరొక అతిథి వంశీకృష్ణ ఐఆర్ఎస్ మాట్లాడుతూ పాఠశాలలోని అత్యాధునిక సాంకేతికతను వినియోగంచుకుని భవిష్యత్తులో దేశాభివృద్ధికి కృషి చేయాలని విద్యార్థులను ఉత్తేజ పరిచారు. అనంతరం మరో అతిథి తెలుగు చిత్ర కథానాయకుడు నిఖిల్ మాట్లాడుతూ ఇంతటి అత్యాధునిక పాఠశాలలో విద్యార్థులు చదువుతున్నందుకు గర్వపడాలని అన్నారు. పాఠశాల చైర్ పర్సన్ సులోచన మాట్లాడుతూ దేశ భవిష్యత్తు బావి భారత పౌరులైన నేటి విద్యార్థులు చేతులోనే వుంది అని కావున విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ పౌరులుగా, మానవతావాదంతో మనుగడ సాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎడిపై పాఠశాల అకాడమిక్ డీన్ జాహ్నవి, ప్రిన్సిపాల్ దేవరాజులు తదితరులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తిలో సంక్రాంతి సంబరాలు-భోగి వెలిగించిన జనం

**శ్రీకాళహస్తి, జనవరి 13 ప్రభాతవార్త**



ప్రతి ఏడాది మొదటగా వచ్చే పండుగల్లో భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు ఎంతో ముఖ్యమై నవిగా చెప్పుకోవచ్చును. సంక్రాంతి సంబరాల్లో భాగంగా శ్రీకాళహస్తి పట్టణంలోని వీధుల్లో జనంతో నిండిపోయింది. పట్టణంలోని ప్రధానవీధులయిన నెహ్రూవీధి, సినిమావీధి, బజారువీధి, నగరివీధులు జనంతోనూ, ద్విచక్రవాహనాలతో నిండిపోయాయి. ఈమార్గంలో ఉన్న బట్టల దుకాణాల్లో ఎటుచూసినా జనం పండగకు కొత్తబట్టలు కొనుగోలు చేస్తు కనిపించారు. మూడు రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతుంది. ఇక గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన జనంతో వీధులు నిండిపోయాయి. ఆర్‌టిసి బస్టాండువీధుల్లో కూడా జనం కిటకిటలాడారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ఇళ్లకు కొత్తశోభను సంతరించుకున్నాయి. గ్రామీణులు ఇంటికి కొత్తరంగులు వేయడానికి రంగులను తీసుకువెళ్తున్నారు. ఇక ఆర్టీసి బస్టాండు, బాబుఅగ్రహారం, కుమారస్వామి తిప్పవీధులు జనంతోనిండిపో యాయి. ఎక్కడ చూసినా ప్రజలు తమ చిన్నారులకు కొత్తబట్టలను కొనుగోలుచేసుకుని కావాల్సిన సామగ్రిని తీసుకుని వెళ్తున్నారు. ఇక మార్కెట్‌వీధిలో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. కూరగాయాల వ్యాపారస్తులుసైతం రోడ్లపైనే కూరగాయలను ఉంచి అమ్ముతున్నారు. ఇక బట్టల వ్యాపారస్తులు సైతం తమ రేట్లను తగ్గించలేదు. ఇక మహిళలు, యువతులు చీరల దుకాణాల్లో తమకు వచ్చిన వాటిని కొను గోలు చేసేందుకు సిద్దమయ్యారు. దీంతో దుకాణాలు కొత్తశోభను సంతరించుకున్నాయి. పండగ అంటే కొత్త బట్టల కొనుగోలుకే ప్రాదాన్యత ఇస్తున్నారు. దాంతో వీధికి నాలుగైదు బట్టల దుకాణాలు వెలు స్తున్నాయి. ఎన్ని దుకాణాలు వెలసినా రద్దీ మాత్రం తగ్గటం లేదు. ఇక సంక్రాంతి సందర్భంగా చెరుకు గడలు సిద్దమయ్యాయి. మహిళలు రంగవల్లులకు రంగులు అద్దడం కోసం రంగులను కొనుగోలు చేయడం కనిపించింది. పెండ్లిమండపం వద్ద ట్రాఫిక్ ఎక్కువ కావడంతో పోలీసులు క్రమబద్దీకరిం చారు.ఇక మహిళలు మట్టి గొబ్బెమ్మను కొనటం కనబడింది. ముత్యాలమ్మగుడివీధిలోని కుమ్మర మిట్ట వద్ద మట్టి ఏనుగులపై గొబ్బెమ్మను తయారుచేసిన విగ్రహాలను పూజలు జరిపి కొనుగోలు చేయటం కనబడింది.

# తమిళనాడు బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి సత్కారం

**శ్రీకాళహస్తి, జనవరి 13 ప్రభాతవార్త**



భారతీయ జనతాపార్టీ తమిళనాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురుగనందం శనివారం శ్రీకాళహస్తీశ్వరస్వామిఅమ్మవార్ల దర్శనానికి విచ్చేశారు. ఈసందర్భంగా బిజెపి ఏపి రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోలా.ఆనంద్ కుమార్ ఆయన్ను కలిసి శ్రీకాళహస్తీశ్వరుని శేషవస్త్రంతో సత్కరించి స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలను అందించారు. అనంతరం బిజెపి పాండ్చేరీ పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు గరికపాటి రమేష్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షులు కొండేటిగోపాల్, పట్టణ ప్రధాన కార్యదర్శులు కోనేటి అయ్యప్ప, మద్దువాసుయాదవ్, పుణ్యండిల్లీకుమార్, సుబ్రమణ్యం, కన్నావెంకటేశ్వర్లు, భరత్‌కుమార్, హరీష్, మోహన్‌రాజు, మధు, గిరిధర్‌సాయి, నాని, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# అయోధ్యరాముని అక్షింతల పంపిణీ

**శ్రీకాళహస్తి, జనవరి 13 ప్రభాతవార్త**



శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పట్టణ ప్రజలకు అయోధ్య శ్రీరాముని పూజిత పవిత్రమైన అక్షింతలును శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులు, మరియు మాజీ ట్రస్టుబోర్డు ఛైర్మన్, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా.ఆనంద్ కుమార్‌ల ఆధ్వర్యంలో పట్టణంలో గ్రామోత్సవం నిర్వహిస్తూ ప్రజలకు అక్షింతలను పంపిణీచేశారు. ఈనెల 22న అయోధ్యరామమందిరం ప్రారంభమవుతుందని ఈనేపథ్యంలో సాయంత్రం ప్రతి ఇంట్లో మహిళలు దీపాలు వెలిగించి అక్షింతలను తలపై చల్లుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పోలస్వామి స్వర్ణమూర్తి, కంటా ఉదయ్‌కుమార్, పసలకుమారస్వామి, గరికపాటి రమేష్‌బాబు, కార్తీకేయన్, అమర్నాధ్, సూర్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద మైనార్టీ యువతికి అండగా బొజ్జల కుటుంబం

**శ్రీకాళహస్తి, జనవరి 13 ప్రభాతవార్త**

ఈనెల రెండో తేదీన పట్టణంలోని 22వ వార్డు పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌లో ఇటీవల నిర్వహించిన ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమంలో భాగంగా పాల్గొనేందుకు విచ్చేసిన తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జలరిషితారెడ్డి ఈ ప్రాంతంలో నివాసం ఉండే ఒక నిరుపేద మైనార్టీ కుటుంబానికి చెందిన షేక్.బాబు, షేక్.హాసీనా దంపతులు కలసి తమ కుమార్తె వివాహ ఏర్పాట్లలో తాము ఎదుర్కొంటునన ఇబ్బందులు తెలిపారు. సగటు మహిళగా ఆ పేద కుటుంబం ఆర్థిక సమస్యను అర్థం చేసుకున్న రిషితారెడ్డి మరియు బొజ్జలసుధీర్‌రెడ్డి దంపతులు యువతి వివాహ ఖర్చుల నిమిత్తం రూ.10వేలను వారి తల్లిదండ్రులకు వార్డు తెదేపా ఇన్‌ఛార్జి నెమళ్ళూరుసుబ్రమణ్యం(బుజ్జి), వార్డు అధ్యక్షులు పూలశేఖర్, బూత్ ఇన్‌ఛార్జి చెంబేటిబాలయ్య, వార్డు కార్యదర్శులు నున్నా అనూష, సులేమాన్, మెదురు శివకుమార్ ద్వారా అందించారు.

# కాసరం ఎస్‌టికాలనీ వాసులకు ఇంటిపట్టాలు

**తొట్టంబేడు, జనవరి 13 ప్రభాతవార్త**



మండలంలోని కాసరం ఎస్‌టి కాలనీ వాసులకు ఎంఎల్ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి తనయ మండల వైకాపా ఇన్‌ఛార్జి పవిత్రారెడ్డి మండలంలోని కాసరం ఎస్టీ కాలనీకి చెందిన నిరుపేదలు 11మందికి శనివారం పార్టీ కార్యాలయంలో ఇంటి పట్టాలు అందించారు. అనంతరం సొంతింటి పట్టాలు అందుకున్న లబ్దిదారులు మాట్లాడుతూ ఏళ్ళ తరబడి నిరీక్షిస్తున్న తమ బాధను అర్థం చేసుకున్న స్థానిక శాసనసభ్యులు బియ్యపుమధుసూధన్‌రెడ్డి తన సొంత ఇంటి కలను నెరవేర్చినందుకు ఎంఎల్ఏకు, పవిత్రారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి సేవాదల్ అధ్యక్షులు డిల్లీబాబు, ఎంపిటిసి గురుమూర్తి, శంకరయ్య, పాండు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో ముందస్తుగా సంక్రాంతి సంబరాలు

**శ్రీకాళహస్తి, జనవరి 13 ప్రభాతవార్త**



పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఉన్న ముందస్తు సంక్రాంతి వేడుకలను విద్యార్థులు అందరితో ఘనంగా నిర్వహించారు. తొలుత భోగి మంటలు వేసి బోగి పండ్లతో చిన్నారులకు ఆశీర్వాదాలు తెలిపారు. అనంతరం సంక్రాంతి ముగ్గులతో అలరించి, ముగ్గుల పోటీలు నిర్వహించి పతంగాలు ఎగురవేస్తూ, గొబ్బెమ్మలు ఆడుతూ, పొంగళ్ళు పొంగిస్తూ సందడిగా వాతావరణం నెలకొంది. పాఠశాల డైరెక్టర్ కాయంసుబ్బరామిరెడ్డి, ప్రిన్సిపల్ ఉమాసింగ్‌లు పాల్గొని ముగ్గులపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కాగా పట్టణంలోని విక్రమ్ విద్యాసంస్థల యూరోకిడ్స్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. చిన్నారులు సంప్రదాయ దుస్తులు ధరించి సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్, కరస్పాండెంట్ మునిలక్ష్మి, ప్రిన్సిపల్ ఉమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని పెద్దమసీదువీధిలో ఉన్న మెగూమి పాఠశాలలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని చిన్నారులు సంబరాలు చేసుకున్నారు. కరస్పాండెంట్ ప్రేమసుందరం చిన్నారులకు పండుగల ప్రాధాన్యతను గురించి వివరించారు.

# దేశమ్మ ఆలయ కుంభాభిషేక నిర్వహణపై సమావేశమైన పాలకమండలి

**నగరి, జనవరి 13 ప్రభాతవార్త:**



నేత్ర దేవత దేశమ్మ ఆలయ రజిత అష్టబంధన కుంభాభిషేక నిర్వహణ నిమిత్తం శనివారం ఆలయంలో పాలక మండలి సమావేశం ఛైర్మన్ వేణు బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఈవో రామచంద్రయ్య సమక్షంలో కుంభాభిషేక నిర్వహణ, ఏర్పాట్లకు సంబంధించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ దేశమ్మ దేవస్థానం మంత్రి రోజా సహాయ సహకారాలతో వేగంగా పునర్మించడం జరిగిందన్నారు. ఆలయం నిర్మాణం పూర్తిచేసి కుంభాభిషేకానికి సిద్ధమైందన దాతల సహకారంతో అత్యంత వైభవంగా కుంభాభిషేకం నిర్వహించుటకు పాలక మండలి ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగిందన్నారు. ఫిబ్రవరి 5న నుంచి 11 తేదీ వరకు కుంభాభిషేక ఉత్సవాలు జరుగుతుందన్నారు. కుంభాభిషేకంకు దాతలు తమకు తోచిన ధన సహాయం వస్తు సహాయం చేసి తగు రసీదు పొందాలన్నారు.

# గ్రావెల్ క్వారీ నియంత్రణలో అధికారులు విఫలం

**విజయపురం, జనవరి 13 ప్రభాతవార్త:**



గ్రావెల్ క్వారీ నియంత్రణలో రెవెన్యూ అధికారులు విఫలం చెందారని మండల వైసీపీ అధ్యక్షుడు గోపినాథ్, వైసీపీ యూత్ అధ్యక్షుడు సతీష్‌యాదవ్ పేర్కొన్నారు. శనివారం మండలకేంద్రమైన విజయపురంలో విలేకరులతో మాట్లాడుతూ గ్రావెల్ క్వారీలను ప్రభుత్వ భూముల్లో తీయకుండా చర్యలు తీసుకోవాలనిడిమాండ్‌చేశారు. మండలంలో గతంలో పెద్ద ఎత్తున ఆరోపణలు ఎదుర్కొనిందని, ప్రభుత్వ భూముల్లో అధికారులు విచ్చల విడిగా ఎన్‌వోసీలు ఇవ్వడం వలన మండలంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ భూముల్లో ఉన్న గ్రావెల్ అనుమతులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# నేటి నుంచి పూడి గ్రామంలో సంక్రాంతి సంబరాలు

**.తొట్టంబేడు, జనవరి 13 ప్రభాతవార్త**

ప్రతి ఏడాదివలె ఈఏడాది కూడా పూడి గ్రామంలో భోగి పండుగ రోజు పాటల పోటీలు సంప్రదాయ ఆటలు చిన్నపిల్లలకు సంబందించిన ఆటలు బాల్ బాడ్మింటన్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని జలగంబాలమురళీ ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా కార్యక్రమాలకు మాజీ దేవాదాయశాఖ కమిషనర్ గుమ్మళ్ళబలరామయ్య, మాజీ సర్పంచ్ గుమ్మళ్ళ సుగుణమ్మ, కర్నూలు జిల్లా కలెక్టర్ గుమ్మళ్ళ సృజనలు హాజరవుతారన్నారు. అదేవిధంగా ఆటలపోటీలు నిర్వహించి బహుమతులను హైకోర్టు న్యాయవాది రవితేజ ప్రధానం చేస్తారన్నారు. కార్యక్రమాలను జెబిఎన్ ఫామ్స్ అధినేత జలగంశ్యామ్, జెపి అగ్రోస అధినేత జలగం చక్రినాయుడు, జలగంస్నేహిత్, హేమంత్, పి.శివ, పి.నాని, ముఖపాటి భార్గవ్ చెరుకుమణి, పూడి యువత ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కోఆర్డినేటర్‌గా రాజా, మోహన్‌నాయుడు, మహేందర్, నాగమణినాయుడు తదితరులు నిర్వహిస్తారన్నారు.

# తిరుపతి డివిజన్

## విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

**వడమాలపేట, జనవరి 13 ప్రభాతవార్త:**



వడమాలపేట బాలుర ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ ధనంజయలు ట్యాబ్‌లు అందజేశారు. శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంతో డిజిటల్ విద్యాబోధనే లక్ష్యంగా ప్రభుత్వం విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసిందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వేడుకగా గోవిందనామసంకీర్తన

**తిరుపతి,జనవరి 13ప్రభాతవార్త:**



ధనుర్మాసంలో చివరగా శనివారం రోజు తిరుపతి నగరంలో రాయలసీమ రంగస్థలి కళాకారులు వేడుకగా గోవిందనామసంకీర్తన చేసి నగరవాసుల్లో భక్తిభావాన్ని చాటారు. రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, కొండే చెంగారెడ్డి, విద్వాన్ కస్తూ పద్మనాభం, కెవిన్ రాజా, రెడ్డప్ప, తిరుపాలాచారి, ధనుంజయరెడ్డి, పొన్నాల జేజిరెడ్డి, ఆటో పద్మనాభం, సాగర్‌రెడ్డి, గంజి, కసవనూరు వాసు తదితరులు పాల్గొని నుదుటిన తిరునామం ధరించి గోవింద నామాలతో నగరంలో ఊరేగింపుగా భజనలు చేశారు.

# తెలుగుదేశం గెలిస్తేనే నగరి అభివృద్ధి, ప్రజలకు రక్షణ

**– గాలి భానుప్రకాష్**



**నగరి, జనవరి 13 ప్రభాతవార్త:**

నగరి మున్సిపాలిటీ 6,7 వార్డుల్లో బాబు షూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో జరిగింది. నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ ఇంటింటికి వెళ్లి బాబు గ్యారెంటీ కరపత్రాలు అందిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. తెలుగుదేశం హయాంలో వేసిన సిమెంటు రోడ్లు, వీధుల్లో ఎల్ఈడీ బల్బులను వాటిని మరమ్మతులు చేసే పరిస్థితి లేదని, సైకిల్ గుర్తుకి ఓటేసి తెలుగుదేశంని గెలిపించి తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. తెలుగుదేశం వస్తేనే నగరి బాగు పడుతుందని పేర్కొన్నారు. సైకిల్ ప్రభుత్వం వస్తే ప్రతి ఇంటికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని, ప్రతి మహిళకు నెలకు 15 వందలు వారి ఖాతాలో వేస్తామన్నారు. ఎంత మంది విద్యార్థులు చదువుకుంటే అంత మందికి ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15 వేలు చెల్లిస్తామన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కింద నెలకు 3 వేలు, రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం బాగు చేస్తామన్నారు. కార్యక్రమంలో నగరి పట్టణ అధ్యక్షుడు రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసన్, సురేష్, మోహన్, ఏసుముత్తు, రవి, సుశీల్, దినేష్, కేశవులు, కృష్ణారెడ్డి, ఆర్ముగం, రమేష్, సుబ్బన్న, కృపాకర్‌నాయుడు, సుబ్బులు, బాలాజీ, గుణశేఖర్, వెంకటాచలం, గణేష్‌లు పాల్గొన్నారు.

# దశాబ్దాల తాగునీటి సమస్యకు పరిష్కారం

**నగరి, జనవరి 13 ప్రభాతవార్త:**



మండలంలోని గుండ్రాజుకుప్పం ఆది ఆంధ్రవాడను తాగునీటి సరఫరాకు రూ.6 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన తాగునీటి సరఫరాను మంత్రి రోజా శనివారం ప్రారంభించారు. ఈ ప్రాంతంలో 75 కుటుంబాల వారు నివశిస్తున్నారు. వీరికి స్థానికంగా నీటి సరఫరా లేకపోవడం వీరికి దశాబ్దంపైగా ఉన్న సమస్య. ఈ సమస్యకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పరిష్కారం చూపింది. మంత్రి ఈ ప్రాంతంలో పర్యటించే సమయంలో స్థానికులు ఆమెకు తమకు ఉన్న నీటి సమస్యను తెలియజేశారు. వెంటనే స్పందించిన ఆమె తాగునీటి మోటారుకు, పైపులైన్‌కి జలజీవన్ మిషన్ పథకంలో రూ.6 లక్షలు మంజూరు చేయించారు. యుద్ధ ప్రాతిపదికన పనులు జరిగాయి. అపరిష్కృతంగా ఉన్న సమస్య పరిష్కరించబడింది. శనివారం మంత్రి నీటి సరఫరాను ప్రారంభించి స్థానికులకు నీటి వసతిని కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజల కష్టాలు తీర్చడంలో తమ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందన్నారు. నివాసితులకు తాగునీరు సరఫరా అయింది. స్థానికులు హారతులు పట్టి మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఆనందంతో కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, నిరంజన్‌రెడ్డి, దేవరాజులురెడ్డి, గుణశేఖర్, గోవర్ధన్, ఏసు, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ సతీష్‌కుమార్, ఏఈలు, వైసీపీ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# మండల స్థాయి పోటీలు ముగింపు



**నగరి, జనవరి 13 ప్రభాతవార్త:**

స్థానిక కేవీకే మైదానం, డిగ్రీ కళాశాల మైదానాల్లో జరిగిన మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలు శనివారం ముగిశాయి. క్రికెట్‌లో ఎం కొత్తూరు సచివాలయం టీం వాలీబాల్‌లో గుండ్రాజుకుప్పం సచివాలయం టీం, బ్యాడ్మింటన్‌లో కశింమిట్ట సచివాలయం టీం మండల స్థాయి విజేతలుగా నిలిచారు. విజేతలను మండల, మున్సిపల్ స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు. హోరాహోరీగా జరిగిన ఈ పోటీలను మున్సిపల్ ఛైర్మన్ నీలమేఘం, కమిషనర్ వెంకట్రామిరెడ్డి, ఎంఈవో శ్రీదేవి, ఎంపీడీవో లీలామాధవి, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శిసురేష్‌బాబు పర్యవేక్షించారు. నాలుగురోజులపాటుఅంపైరింగ్ చేసిన 10 మంది యువకులను ప్రశంసించారు. మండల స్థాయి విజేతలు నియోజకవర్గ స్థాయిలోను ప్రతిభ కనబరచాలన్నారు.

# పాళెం కోమలకు డాక్టరేట్



**రేణిగుంట, జనవరి 13 ప్రభాతవార్త:**

రేణిగుంట మండలం గాజులమండ్యం గ్రామానికి చెందిన బైనగారి నాగూర్‌రెడ్డి సతీమణి పాళెం కోమలకు గుంటూరు జిల్లా వడ్డేశ్వరం కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్(యూనివర్సిటీగా పరిగణింపబడే) డాక్టర్‌ని(పీహెచ్‌డీ) ఇచ్చింది. ఆమె చిత్తూరు జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల మహిళా సాధికారిక అనే అంశంపై కోనేరు లక్ష్మయ్య ఎద్యుకేషన్ ఫౌండేషన్‌లో మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ప్రొఫెసర్ డా. ఏవీఎన్ మూర్తి పర్యవేక్షణలో అధ్యయనం చేశారు. అధ్యయనంలో కృతార్థురాలు కావడంతో ఆమెకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. డాక్టరేట్ అందుకున్న కోమలను ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ జువ్వల ధనంజయరెడ్డి, రేణిగుంట మండలవైసీపీకన్వీనర్,సర్పంచ్‌డా. గంగారి రమేష్, ముచ్చెలి జగదీశ్వర్‌రెడ్డి, గ్రామస్థులు అభినందించారు.

# రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వగల్గింది ఒక్క కాంగ్రెస్ పార్టీయే!

**డాక్టర్ చింతామోహన్**



**శ్రీకాళహస్తి,జనవరి 13 ప్రభాతవార్త**

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వగల్గింది ఒక్క కాంగ్రెస్ పార్టీయే అని మాజీ మంత్రి కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ చింతామోహన్ అన్నారు. శనివారం ఆయన వివిఎం పల్లి నుంచి ఇంటింటికి కాంగ్రెస్ అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ది చెందాలన్నా సుభిక్షంగా ఉండాలన్నా మళ్ళీ కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు.నాడు ఇచ్చిన మాట మేరకు అమలు చేయాలంటే రాహుల్ గాంధీ ప్రధాని కావాలన్నారు. కాంగ్రెస్‌ను కాదని బిజెపికి అధికారం ఇచ్చిన తరువాత పదేళ్ళలో ఏం జరుగుతుందో అలాగే ఒక్క చాన్సు కోరిన పరిపాలన చూస్తున్నారు కదా? ఓ వైపు అంగన్ వాడీల సమ్మెలు, మున్సిపల్ కార్మికుల ఆందోళనలు,శ్రీ సిటి కార్మికుల సమస్యలు గురించి పట్టించుకునే నాధుడు లేదు,ప్రజా ప్రతినిధులుగా గెలిచిన సర్పంచ్ నిదులు రాష్ట్ర ప్రభుత్వం మళ్ళించుకుంటుంది. నాలుగేళ్ళుగా ఇదే తంతు జరుగుతుంది.కానీ కేంద్ర ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవటం లేదని చింతామోహన్ ప్రశ్నించారు.ప్రభుత్వ ఉద్యోగులకు ఉపాధ్యాయులకు పాత పెన్షన్ ఇవ్వగల్గింది కాంగ్రెస్ పార్టీయే అన్నారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. పండించిన పంటలకు మద్దతు ధర లేదు.ఉచితాలతో రాష్ట్రాన్ని దివాలా తీయించారు. కాంగ్రెస్ హయాంలో దుగ్గరాజు పట్టణం పోర్టు, మన్నవరం ప్రాజెక్టు, నడికుడి శ్రీకాళహస్తి రైల్వేలైన్ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు మారింది.

# పల్లెలో ప్రారంభమైన సంక్రాంతి సంబరాలు

**విజయపురం, జనవరి 13 ప్రభాతవార్త:**

మండలంలోని పల్లెలో సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం భోగి పండుగ పర్వదినాన్నిపురస్కరించుకుని పిల్లలు మొదలు పెద్దలు వరకు భోగి మంటలు వేయడానికి ముళ్ళ కంపలను, చెరకు ఆకులను, పెద్ద మొక్కలను సేకరించారు. వీధుల్లో ముగ్గులు వేయడానికి మహిళలు శుభ్రం చేసుకుంటున్నారు. చెత్తా చదారం, ఇంట్లో వ్యర్థాలను భోగి మంటలో వేయడానికి సిద్ధం చేసుకుంటున్నారు.మండలంలోని విజయపురం, కోసలనగరం, జంబాడ, పాతార్కాడు, మహారాజపురంలో సంక్రాంతిని పురస్కరించుకుని యువత డ్యాన్సు, ఆటలు, ముగ్గుల పోటీలు నిర్వహించడానికి ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు.

## 6 మంది ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు అరెస్టు

**- రూ.8.26 లక్షల రాగితీగలు, 3 ద్విచక్రవాహనాలు స్వాధీనం- డిఎస్పీ శ్రీనివాసమూర్తి**

చిత్తూరు, జనవరి 13 ప్రభాతవార్త: చిత్తూరు ఈస్ట్ సర్కిల్ పరిధిలోని ఎన్ఆర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాల కేసు చిక్కుముడిని చిత్తూరు ఈస్ట్ సర్కిల్ పోలీసులు గుట్టు విప్పారు. ట్రాన్స్‌ఫార్మర్లను దొంగతనం చేసిన కేసు లో పోలీసులు శనివారం చిత్తూరు జిల్లాకు చెందిన నలుగురు, తమిళనాడుకు చెందిన ఇద్దరిని అరెస్టు చేసి వారి నుండి 8.26 లక్షల రూపాయల విలువైన కాపర్ వైరుతో పాటు మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొన్నారు. చిత్తూరు ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో శనివారం డిఎస్పీ శ్రీనివాసమూర్తి విలేకరులకు ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. చిత్తూరు ఈస్ట్ సర్కిల్ పరిధి లో ఎన్ఆర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనం కేసు ల్లోని దొంగల గురించి కచ్చితమైన సమాచారం అందడంతో తన పర్యవేక్షణలో వెస్ట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.గంగిరెడ్డి ఆధ్వర్యంలో ఎన్ఆర్‌పేట ఎస్ఐ కెవి సుబ్బమ్మ, తాలుకా ఎస్ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి, జిడినెల్లూరు ఎస్ఐ రామా ంజనేయులు, చిత్తూరు ఈస్ట్ సర్కిల్ క్రైమ్ సిబ్బంది సుధాకర్, రాజ్‌కుమార్, ఎన్ఆర్‌పేట పోలీస్ స్టేషన్ సిబ్బంది సహాయంతో శనివారం తెల్లవారుజాము 6.30 గంటలకు చిత్తూరు రూరల్ మండలం చిత్తూరు-తిరుత్తణి రోడ్డులో కుర్చివేడు క్రాస్ వద్ద ఆరు మంది నిందితులను అరెస్టు చేయడం జరిగింద న్నారు. వీరి నుండి రూ.8.26 లక్షల విలువైన 757 కేజీల కాపరు వైరు, 250 మీటర్ల కరెంటు కేబుల్ వైర్లతో పాటు మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు ఈ కేసులో అరెస్టు చేసిన వారిలో తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా వాలజా తాలుకాకు చెందిన సూర్యఏలుమలై(23), ఇ.శివలింగం(30), పాలసముద్రం మండలం వెంగళ్రాజుకుప్పం కనికాపురం హెచ్‌డబ్ల్యుకు చెందిన ఆర్.దినేష్(22), వెంగళ్రాజుకుప్పం విఆర్‌కుప్పం డిడబ్ల్యుకు చెందిన పి.ఆదిత్య(19), వెంగళ్రాజుకుప్పం ఇందిరానగర్‌కు చెందిన ఎ.ప్రవీన్‌కుమార్(23), వెంగళ్రాజుపురం దీనబంధుపురంకు చెందిన ఆల్లీ అబ్బాస్(25)లు వున్నారన్నారు. ఈ కేసును అతి తక్కువ సమయంలో చేధించిన పోలీసు అధికారులు, సిబ్బందికి డిఎస్పీ శ్రీనివాసమూర్తి క్యాష్ రివార్డులతో అభినందించారు.

## తెలుగు సాంప్రదాయాలకు 'వార్త' నిలువుటద్దం

**-తెలుగుదనం ఉట్టిపడేలా ముగ్గుల పోటీలు**
**-మిస్ ఇండియా ఐకాన్‌దివా భావనా చిన్నతంబు**




మొదటి బహుమతి ఎల్ఈడి టివి






తిరుపతిటౌన్,జనవరి 13ప్రభాతవార్త: తెలుగుసాంప్రదాయాలకు నిలువుటద్దంలా'వార్త' తెలుగుజాతీయ దినపత్రిక ముగ్గులు పోటీలు నిర్వహించి, ఆనందోత్సాహాల మధ్య మహిళలు రంగువల్లులు వేయడం అభినందనీయమని మిస్ ఇండియా ఐకాన్‌దివా -2023 భావనా చిన్నతంబు అన్నారు. తెలుగుదనం ఉట్టిపడేలా జరుపుకునే భోగి, సంక్రాంతి,కనుమ పర్వదినాల విశిష్టతను తెలియజేస్తూ మహిళలు రంగ వల్లులు తీర్చిదిద్దడం సంతోషకరమన్నారు. వార్త దినపత్రిక యాజమాన్యం నేటికీ తెలుగు సాంప్రదాయాలను పరిరక్షిస్తూ, ప్రతి ఏడాది ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించడం ఆనందమైన విషయమన్నారు. మన పండుగలు, సంస్కృతులు, సంప్రదాయాలే నేటికీ మనల్ని ముందుకు నడిపిస్తున్నాయన్నారు. తెలుగువాళ్ళముగా మన సంప్రదాయాలను, సంస్కృతిని కాపాడుకోవడంలో మహిళలు ముందుకు రావడం హర్షించదగిన విషయమన్నారు. శనివారం ఉదయం తిరుపతిలోని ఇందిరా మైదానంలో జరిగిన 'వార్త' దినపత్రిక ముగ్గుల పోటీల్లో పెద్దసంఖ్యలో మహిళలు ఉత్సాహంగా పాల్గొని సంప్రదాయాలను గుర్తుచేసేలా రంగురంగుల ముగ్గులు అందంగా తీర్చిదిద్దారు. మన పండుగల సందర్భంగా సంప్రదాయాలను ప్రజలకు తెలిసేలా 'వార్త'యాజమాన్యం చూపిస్తున్న చొరవ ప్రత్యేకంగా అభినందించదగిన విషయమని ఆమె కొనియాడారు. ఈ సందర్భంగా వందమంది మహిళలు పాల్గొని ముగ్గులు వేయడం వారిలో ఉన్న ఆసక్తిని తెలియజేస్తుందన్నారు. ఇందిరామైదానంలో నిర్వహించిన "వార్త" ముగ్గుల పోటీల్లో పాల్గొని మహిళలు వేసిన ముగ్గులను మిస్ ఇండియా ఐకాన్‌దివా భావనా చిన్నతంబు పరిశీలించారు. అనంతరం ప్రతి ముగ్గును ఆమె, మిత్ర ఎంటర్‌టైన్‌మెంట్ వ్యవస్థాపకుడు ,రియల్టర్ సి.గోపీకృష్ణ, పులికంటి మోహన్‌రెడ్డి నిశితంగా గమనించి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. వందమందివేసిన ముగ్గుల్లో మన సంప్రదాయాలను తెలియజేసేలా ముగ్గులు తీర్చిదిద్దిన మహిళల్లో ఎం.విద్య(కొర్లగుంట) మొదటి బహుమతి-ఎల్ఈడి టివి, రెండవ బహుమతి బి.బుజ్జీరావు (చిన్నకాపువీధి) -వెండి గాలిగొలుసులు, మూడవ బహుమతులు-పి.భారతి(జీవకోన)-పట్టుచీర, వి.నీలమణి-పట్టుచీర, వై.వాణి-పట్టుచీర అందుకున్నారు. మిగిలిన వారంతా ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొని ముగ్గులు వేయడంతో అందరినీ ప్రోత్సహించేలా ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. వార్త దినపత్రిక అభిమానులు, శుభమస్తు షాపింగ్ మాల్, బాలాజీ జ్యూవలర్స్ యాజమాన్యం తమవంతు సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో 'వార్త' తిరుపతి యూనిట్ ఎడిషన్ ఇన్‌ఛార్జి ఆలూరి గిరిధర్, తిరుపతి జిల్లాకేంద్రం వార్త పాత్రికేయులు పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి అంగన్‌వాడీ మహిళల శాపం తప్పదు: అమరనాథరెడ్డి



గంగవరం, జనవరి 13 ప్రభాతవార్త : వైఎస్సార్సీపి ప్రభుత్వానికి అంగన్‌వాడీ మహిళల శాపం తగలక తప్పదని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు.గత 30రోజులుగా సమ్మె బాటలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఆయాలకు శనివారం ఆయన మద్దతు తెలిపారు. పలమనేరు నియోజకవర్గంలోని పలమనేరు,గంగవరం మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు,ఆయాలు పట్టణంలోని స్త్రీ శిశు సంక్షేమశాఖ కార్యాలం వద్ద నిరసన కార్యక్రమం చేస్తుండగా మాజీ మంత్రి అమరనాథరెడ్డి కలిసి వారికి తన సంఘీభావం తెలిపారు.మీ పోరాటంలో చివర వరకు తెలుగుదేశం పార్టీ మద్దతు ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వచ్చినపుడు అంగన్‌వాడీలకు కేవలం రూ.4200 మాత్రమే వేతనం ఉండేదని,కానీ చంద్రబాబునాయుడు ఏకంగా రూ.10500కు ఆ వేతనాన్ని పెంచారని,అలాగే ఆయాలకు రూ.3000 ఉన్న వేతనాన్ని రూ.6000కు పెంచారని ఆయన గుర్తు చేశారు.తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం గడిచిన నాలుగన్నరేళ్ళలో కేవలం రూ.1000 మాత్రమే పెంచారన్నారు. అంగన్‌వాడీ సమస్యలపై చంద్రబాబు,లోకేష్ దృష్టికి తేసుకెళ్ళి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరిస్తామని ఆయన భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు,ఆయాలతో పాటు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగరాజు, టిడిపి నాయకులు గిరి,కిషోర్‌గౌడు,సోమశేఖర్‌గౌడు,ప్రతాప్‌రెడ్డి,సర్పంచ్ చంద్రశేఖర్, న్యాయవాది సుబ్బరామయ్య, వసరాయప్ప, దేవేంద్రరెడ్డి, జగదీష్‌నాయుడు, రామ్మూర్తినాయుడు, బత్తిగౌడు, సుబ్బారెడ్డి, జనసేన నాయకులు దిలీప్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రంగవల్లులు.. సంక్రాంతి శోభకు నిదర్శనాలు

**జనసేన జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్**



తిరుపతి టౌన్, జనవరి 13 ప్రభాతవార్త: జనసేనాని పవన్ కళ్యాణ్ సూచన మేరకు తిరుపతిలో మన ఊరు మన ఆటలో భాగంగా స్థానిక 14వ డివిజన్‌లో ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. జనసేన నేతలు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆకేపాటి సుభాషిణి ఆధ్వర్యంలో జరిగిన ఈ ముగ్గుల పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులు చేసుకునే పెద్ద పండుగ సంక్రాంతి అన్నారు. సంస్కృతి సాంప్రదాయాలను కాపాడేందుకు జనసేనాని పవన్ కళ్యాణ్ మన ఊరు మన ఆట కార్యక్రమాలు చేయాలని సూచించారన్నారు. అనంతరం సంక్రాంతి వీర మహిళ ప్రత్యేక ముగ్గును చూసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బత్తిన మధుబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజీవ్ యాదవ్, తిరుపతి నగర ఉపాధ్యక్షుడు దినేష్ జైన్, బాబ్జీ, పార్థు, లక్ష్మి, జిల్లా కార్యదర్శులు ఆనంద్, బాటసారి, ఉమ్మడి చిత్తూరు జిల్లా యువ నాయకులు పగడాల యువరాజ్ రాయల్, నూనె దిలీప్ రాయల్, తిరుపతి నగర కమిటీ సభ్యులు హిమవంతు, మనోజ్ కుమార్, సాయిదేవ్ యాదవ్, హేమంత్, పురుషోత్తం, సాయి కుమార్, గిరిపురం పురుషోత్తం, నవీన్, మదులత, దివ్య, దుర్గ, చందన, జనసేన పార్టీ వీర మహిళలు, తిరుపతి నగర కమిటీ సభ్యులు, వివిధ విభాగాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## యువత ఆరోగ్యానికి క్రీడలు ముఖ్యం : గాలి భానుప్రకాశ్

పుత్తూరు, జనవరి 13 ప్రభాతవార్త : యువత ఆరోగ్యానికి క్రీడలు ముఖ్యమని తెలుగుదేశం పార్టీ నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాశ్ అన్నారు. శనివారం మునిసిపాలిటీలోని చర్చ్ కాంపౌండ్‌లో పదో వార్డు తెలుగు యువత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ



సందర్భంగా మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా సాధ్యమవుతుందన్నారు. అనంతరం టోర్నమెంట్‌లో పాల్గొంటున్న వివిధ జట్టు సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకుడు, రాష్ట్ర తెలుగు యువత మీడియా సమన్వయకర్త డి.జి.ధనపాల్, టిడిపి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య, పట్టణాధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్.ఎన్.ధనపాల్, నాయకులు గాలి గోపినాథ్, డి.శ్రీనివాసులు, రూపేంద్ర, ఈశ్వర్‌యాదవ్, లక్ష్మణాచ్చారి తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదనం ఉట్టిపడేలా సంక్రాంతి జరుపుకోవాలి

తిరుపతి క్రైం, జనవరి 13 ప్రభాతవార్త : తెలుగుదనం ఉట్టి పడేలా భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగలను ఆనందోత్సాహాల మధ్య ఇంటిల్లిపాది జరుపుకోవాలని జిల్లా ఎస్పి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎస్పి పరమేశ్వర రెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఎక్కడా జల్లికట్టు, కోడి పందేలు జరుగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పి, పోలీస్ యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా వరుస సెలవులు ఉన్నందున, ప్రజలు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు ఇళ్లకు తాళం వేసి గ్రామాలకు వెళ్తుంటారు. ఇటువంటి సందర్భాలలో దొంగతనాలు ఎక్కువగా జరిగే ఆస్కారం ఉంది. ప్రజలు తాళం వేసి ఊర్లకు వెళ్లేవారు తమ వివరాలు సంబంధిత పోలీసు స్టేషన్‌లో తెలిపినచో, ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ నుండి వాచ్ రిక్వెట్ పంపిన ఎడల, వారి ఇళ్ళల్లో వారి సమక్షంలో జిల్లా పోలీసు వారు సిసి కెమెరాలు ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా ఏర్పాటు చెయ్యడం జరుగుతుంది. జిల్లా ప్రజలు ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో ఏ ప్రాంతంలోనైనా జల్లికట్టు, కోడి పందేలు జరుగుతున్నా.. జరిగే వీలున్నా.. వెంటనే ఆ సమాచారాన్ని డయల్ 100 లేదా జిల్లా పోలీసు వాట్సాప్ నెంబర్ 8099999977కు ఫోన్ లేదా సంక్షిప్త సందేశం రూపంలో జిల్లా పోలీసు వారికి చేరవేయవచ్చన్నారు. తమ సిబ్బంది వెంటనే చర్యలు తీసుకుంటారని, సమాచారం చేర వేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్పి పరమేశ్వర రెడ్డి తెలిపారు.

## ఘనంగా శ్రీతాళమ్మ అమ్మవారి గ్రామోత్సవం



గూడూరు, జనవరి 13 ప్రభాతవార్త : భోగి పండుగను పురస్కరించుకొని శనివారం శ్రీతాళమ్మ అమ్మవారి గ్రామో త్సవం గూడూరులో నిర్వహించారు. ఈ క్రమంలో తాళమ్మ దేవాలయంలో శనివారం మధ్యాహ్నం జరిగిన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వరప్రసా దరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ, డిఎస్పీ సూర్య నారాయణరెడ్డి పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యే వరప్రసాదరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్ పర్సన్ దేవసేనమ్మను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు నాసిన నాగులు, గిరిబాబు, కోదండరామయ్య, సురేష్‌రెడ్డి, ముని, అన్నం మురళి తదితరులు పాల్గొన్నారు.

## భోగి మంటల్లో ఎస్మా నోటీసులు

గూడూరు, జనవరి 13 ప్రభాతవార్త : గూడూరులో అంగన్‌వాడీ కార్యకర్తలు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 33వ రోజుకు చేరుకున్నాయి. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలు శిబిరం ముందు ముగ్గులతో పాటు భోగి మంటలు వేసి అందులో ఎస్మా జీవో కాపీలను దగ్ధం చేశారు. సిఐటియు నాయకులు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం అంగన్‌వాడీల సమ్మెను అణచివే యడానికి ఎస్మా చట్టాన్ని తీసు కొచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ అధ్యక్షురాలు ఎ.ఇంద్రావతి, కార్యదర్శి బిఎస్ ప్రభావతి, సిఐటియు పట్టణ అధ్యక్షులు బివి రమణయ్య, కార్యదర్శి సురేష్, మున్సిపల్ జిల్లా కార్యదర్శి గోపినాథ్, గుర్రం రమణయ్య, ప్రసాద్, బి.చంద్రయ్య, సెక్టార్ లీడర్లు పెంచలమ్మ, మునికుమారి, లక్ష్మిలు పాల్గొన్నారు.



## విలేజ్ క్లినిక్‌ను పర్యవేక్షించిన కేంద్ర వైద్యబృందం



చౌడేపల్లి, జనవరి 13 ప్రభాతవార్త : ప్రజారోగ్యం, ఆరోగ్య కేంద్రాల సేవలపై కేంద్ర బృందం క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. శనివారం మండలంలోని పంచాయతీ కేంద్రం వెంగళపల్లిలోని వైఎస్సార్ విలేజ్ హెల్త్‌క్లినిక్‌ను కేంద్ర వైద్య బృందం సందర్శించారు. గ్రామస్థాయిలో ప్రజలకు అందుతున్న వైద్యం, వైద్య సిబ్బందిపై ఆరా తీశారు. వైద్యులు రోగుల పట్ల వ్యవహారశైలిని నిశితంగా గమనించారు. ముఖ్యంగా గర్భవతులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు అందుతున్న వైద్యాన్ని వారినే అడిగి తెలుసుకొన్నారు. భవనాలు, మౌళిక వసతుల కల్పన వంటివి పర్యవేక్షించారు. వీటిని కేంద్రానికి అప్పగించిన తర్వాత ఎంపిక కాబడ్డ ఆరోగ్య కేంద్రాలకు అక్కడి నుంచి నిధులు కేటాయిస్తారని జిల్లా క్వాలిటీ అసెస్‌మెంట్ అధికారి డాక్టర్ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సర్పంచు నాగరత్నాఓబులేసు, వైద్యాధికారి పవన్‌కుమార్, డాక్టర్ పూజా, పిహెచ్‌ఎన్ కృష్ణవేణి, సూపర్‌వైజర్ జమున, ఎంఎల్‌హెచ్‌ఓలు, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## 15న అయ్యప్ప మకరజ్యోతి దర్శనం

సదుం, జనవరి 13 ప్రభాతవార్త: యర్రాతివారిపల్లె బురుజుకొండపై వెలసిన అయ్యప్పస్వామి వారి ఆలయం వద్ద ఈనెల 15 అయ్యప్ప మకరజ్యోతి దర్శనం ఉంటుందని జడ్పీ మాజీ ఉపా ధ్యక్షుడు పెద్దిరెడ్డి తెలిపారు. ప్రతి ఏటా జనవరి14న కనుమ పండుగ రోజున మకరజ్యోతి దర్శనం ఉండగా ఈఏడాది ఫి బ్రవరి నెలకు 29 రోజులు వచ్చినందున ఒక్క రోజు ముందుకు అనగా 15 వ తేదీన మకరజ్యోతి దర్శనం ఉంటుందన్నారు. అయ్యప్పమాలలు వేసుకున్న భక్తులు చాలా మంది ఇప్పటికే ఇరుముడులు చెల్లిస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఆలయం ధర్మకర్త, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పలు ఏర్పాటు చేశారు.



## శ్రీసిటీని సందర్శించిన అడిషనల్ డీజీపి



సత్యవేడు, జనవరి 13 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, రాష్ట్రస్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ చైర్మేన్ అతుల్‌సింగ్ ఐపిఎస్ శనివారం శ్రీసిటీని సందర్శించారు. ఆయన భార్య ప్రఖ్యాత ఆర్కిటెక్, ఇంటీరియర్ డిజైనర్ శ్రీమతి ప్రియాసింగ్ కూడా పాల్గొన్నారు.మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వారికి సాదరస్వాగతం పలికి, శ్రీసిటీ ప్రపంచశ్రేణి మౌళిక సదుపాయాలు, పారిశ్రామిక ప్రగతి, భద్రతా వ్యవస్థ, ప్రత్యేకతలను వివరించారు. పర్యటనలో శ్రీసిటీ పరిసరాలను చుట్టి చూడటంతో పాటు క్రియా విశ్వవిద్యాలయం, రాక్‌వర్త్, ఎవర్టన్, హంటర్‌డగ్లస్ పరిశ్రమలను వారు సందర్శించారు.

## శ్రీసిటీలో సంక్రాంతి సంబరాలు




సత్యవేడు, జనవరి 13, ప్రభాత వార్త: శ్రీసిటీలో ముందస్తు సంక్రాంతి సంబరాలు వేడుకగా జరిగాయి. శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్యవేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో స్థానిక శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శనివారం ముగ్గుల పోటీలు, కోలాటం కార్యక్రమాలు నిర్వహించారు. ముగ్గులపోటీలల్లో శ్రీసిటీలోని వివిధ విభాగాలకు చెందిన మహిళా ఉద్యోగులు, పరిసర గ్రామాల మహిళలు పాల్గొన్నారు. ఆరూరు గ్రామస్తులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను ఎంతగానో ఆలరించాయి. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, శ్రీసిటీ డైరెక్టర్ సుధాకర్ రెడ్డి, ముఖ్యఅతిథులుగా విచ్చేసిన డీజిపి అతుల్‌సింగ్, ఆయన సతీమణి ప్రియాసింగ్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు. తెలుగు ప్రజలు ఎంతో ఇష్టంగా జరుపుకునే పెద్దపండుగను పురస్కరించుకుని శ్రీసిటీలో ప్రతి ఏటా ఈముగ్గుల పోటీలను నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందంటూ శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి వ్యాఖ్యానించారు. తమ సిబ్బంది, శ్రీసిటీ పరిశ్రమల ఉద్యోగులు, కార్మికులు, ఈప్రాంత ప్రజలకు ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ముగ్గుల పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా నిలిచిన కీర్తన, నిషా, పూర్ణిమలు ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీమతి ప్రియాసింగ్ చేతులుమీదుగా నగదు బహుమతి అందుకున్నారు.

## చెంగారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన రోజా



నగరి, జనవరి 13 ప్రభాతవార్త: మాజీ మంత్రి రెడ్డివారి చెంగారెడ్డికి మంత్రి రోజా దంపతులు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం మాజీ మంత్రి జన్మదినాన్ని పురస్కరించుకుని సాయి దివ్యధామంలో నిర్వహించిన వేడుకలకు హాజరైన మంత్రి రోజా కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి ప్రతిమను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి, మంత్రి ఆప్యాయంగా సంభాషించుకోవడం ప్రత్యేకతను సంతరించుకుంది. మంత్రి వెంట రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సెల్వమణి, కౌన్సిలర్లు, వైసీపీ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## శివయ్యను దర్శించుకున్న మంచు విష్ణు



శ్రీకాళహస్తి,జనవరి 13 ప్రభాతవార్త : దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన వాయులింగేశ్వరుని శనివారం సినీనటుడు మంచువిష్ణు దర్శించుకున్నారు.ఆయనకు మాజీ శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ ప్రస్తుత రాష్ట్ర బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్ సారధ్యంలోఘనస్వాగతం పలికారు.డైనమిక్ హీరో మంచుమోహన్‌బాబు కుమారుడు మంచు విష్ణు కథానాయకుడుగా భక్తకన్నప్ప చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గత ఏడాది ఈ సినిమా ప్రారంభోత్సవాన్ని ఇక్కడ నిర్వహించారు.భవిష్యత్తు ఆశాజనకంగా ఉండాలని శివయ్యను కోరుకున్నామని మంచు విష్ణు వివరించారు.

